ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3

విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 29 మే 2025

స్ఫూర్తి ప్రదాత ఎన్టీఆర్

జయంతి కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్



దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని సాగరతీరంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ...వార్త 6వ పేజీలో

డబుల్ డెక్కర్ బస్సులు వస్తున్నాయ్..



- త్వరలో బీచ్ రోడ్డులో అందుబాటులోకి తీసుకురానున్న అధికారులు

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బీచ్ రోడ్డులో డబుల్ డెక్కర్ (హాప్-ఆన్ హాప్-ఆఫ్) బస్సులు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. బీచ్ రోడ్డులో ఎకో టూరిజాన్ని మరింతగా అభివృద్ధి చేయ డానికి వీలుగా పర్యాటకశాఖ, జీవీఎంసీ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ సంయుక్తంగా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశాయి. ఆర్కే బీచ్ నుంచి తొట్లకొండ వరకు ఉన్న పర్యాటక ప్రాంతాలు, సందర్శనీయ స్థలాలను కలుపుతూ నడిచేలా మూడు డబుల్ డెక్కర్ బస్సులను సమకూర్చుకోవాలని నిర్ణయించాయి. వీటిలో ఒక బస్సును అశోక్ లేలాండ్ రాష్ట్ర ప్రభుత్వానికి విరాళంగా ఇవ్వగా.. దీనిని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ విశాఖకు కేటాయించారు. మరో రెండు బస్సులను ... మిగతా 4వ పేజీలో

రాకాసి అలలు!

- తీవ్ర అల్పపీడన ప్రభావంతో తీరంలో భారీ కోత
- బీచ్ రోడ్డులో రక్షణ గోడను తాకుతున్న సంద్రపు నీరు



అలల ఉధృతికి బీచ్ రోడ్డులోని సబ్‌మెరైన్ సమీపంలో కోతకు గురవుతున్న తీరం -4లో

తగ్గిన ఉక్కు ఉత్పత్తి

కాంట్రాక్టు కార్మికుల సమ్మె మొదలుకాక ముందు రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా 14 వేల టన్నులు ఉత్పత్తి



- ప్రస్తుతం 10 వేల నుంచి 11 వేల టన్నులు మాత్రమే...
- ఇటువంటి పరిస్థితుల్లో మూడో బ్లాస్ట్ ఫర్నేస్ నడపడం కష్టమే
- స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల సమ్మెపై ప్రభుత్వం ఆరా
- ముఖ్యమంత్రిని కలిసేందుకు కడప వెళ్లిన సీఎండీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) కాంట్రాక్టు కార్మికులను కుదిం చినప్పటికీ, ఉత్పత్తి తగ్గకుండా చూడాలనే విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం ప్రయత్నాలు నెరవేరేలా కనిపించడం లేదు. వచ్చే నెల మూడో వారంలో మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తి ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. చైనా నుంచి తెప్పించిన కూలింగ్ ప్లేట్లను మూడు రోజుల క్రితమే బ్లాస్ట్ ఫర్నేస్-3లో అమర్చారు. మిగిలిన పనులు ఒక్కొక్కటిగా చేసుకుంటూ వెళుతున్నారు. మరోవైపు ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే మూడు వేల మందిని ఆపేసింది. మరో రెండు వేల మందితో జాబితా తయారుచేసింది. వారికి గేటుపాస్‌లు ఇవ్వలేదు. అంటే వారిని కూడా తొలగించినట్టే. యాజమాన్యం తాను అనుకున్నట్టుగా ఐదు వేల మందిని తగ్గించినట్టే. మిగిలిన ఎనిమిది వేల మందితోనే మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడిపిస్తామని కేంద్ర ప్రభుత్వ పెద్దలకు చెబుతోంది. అయితే ఇప్పుడు రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు మాత్రమే నడుస్తున్నాయి. కాంట్రాక్టు కార్మికుల సమ్మె ... మిగతా 4వ పేజీలో



స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ భవనంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

ఉపాధి కల్పించకపోతే చంపేయండి

ఉక్కు అధికారుల ఎదుట కాంట్రాక్టు కార్మికుల తీవ్ర ఆవేదన

- రెండో రోజూ కొనసాగిన స్టీల్‌ప్లాంటు పరిపాలనా భవనం ముట్టడి
- పోలీసులు, కార్మికుల మధ్య తీవ్ర తోపులాట
- నేడు, రేపు దీక్షా శిబిరం వద్ద నిరసనలు
- 30న ఆర్‌ఎల్‌సీ సమక్షంలో చర్చల తరువాత భవిష్యత్తు కార్యాచరణ

ఉక్కుటౌన్‌షిప్, మే 28 (ఆంధ్రజ్యోతి): పనులు లేక ఆకలితో అలమటిస్తున్నామని, ఉపాధి కల్పించలేకపోతే తమను చంపేయాలని ఉక్కు అధికారుల ఎదుట స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వరుసగా రెండో రోజు...బుధవారం కూడా కాంట్రాక్టు కార్మికులు అడ్మిన్ భవనం ముట్టడికి యత్నించారు. తొలుత ప్లాంటు గేట్లను దిగ్బంధించాలని కార్మిక నాయకులు పిలుపు నిచ్చినప్పటికీ అనుమతి లేదని పేర్కొంటూ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉదయం ఎనిమిది గంటలకు అడ్మిన్ భవనం వద్దకు చేరుకుని లోపలకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల నడుమ తోపులాట జరిగింది. ఈ క్రమంలో కొందరు కార్మికులు కింద పడిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అడ్మిన్ భవనం ముందే కార్మికులు బైఠాయించారు. ప్లాంటు ... మిగతా 4వ పేజీలో

థియేటర్లలో ఇష్టారాజ్యం

క్యాంటీన్లలో అధిక ధరలకు విక్రయాలు

- మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానం
- సినిమా హాళ్ల లోపల పారిశుధ్యం ఘోరం
- పోలీస్, రెవెన్యూ, జీవీఎంసీ, అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో సినిమా హాళ్లలో తనిఖీలు
- నేడూ కొనసాగుతాయన్న అధికారులు

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): **నగరంలోని సినిమా థియేటర్లు, మల్టీప్లెక్స్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు ప్రభుత్వం బుధవారం నిర్వహించిన తనిఖీల్లో తేటతెల్లమైంది. సినిమా థియేటర్లు, మల్టీప్లెక్స్‌ల్లో పరిస్థితులు, క్యాంటీన్లలో ధరలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి నివేదిక పంపాలంటూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది. ఈ మేరకు జిల్లా రెవెన్యూ, జీవీఎంసీ, పోలీస్, అగ్నిమాపకశాఖ, ఆహార భద్రత నియంత్రణ విభాగం అధికారులు సంయుక్తంగా తనిఖీలను ప్రారంభించారు.**

జిల్లాలోని 57 థియేటర్లు, ఏడు మల్టీప్లెక్స్‌ల్లో ఇద్దరు ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్ మాధుర్ ఆధ్వర్యంలో 11 మంది తహశీల్దార్లు, సీఐలు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు థియేటర్లు, మల్టీప్లెక్స్‌ల్లోని క్యాంటీన్లలో తినుబండారాలు, శీతల పానీయాల ధరలను భారీగా పెంచి విక్రయిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. అలాగే థియేటర్లలోని మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉండడంతో పాటు తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నట్టు గుర్తించారు. థియేటర్ల లోపల కూడా పరిశుభ్రత లేకపోవడం, సిట్టింగ్ కూడా సరిగ్గా లేకపోవడాన్ని వారు గుర్తించారు. గురువారం కూడా తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.



దొండపర్తిలోని మీరజ్ థియేటర్‌లో పాప్‌కార్న్‌ను టేస్టు చేస్తున్న తహశీల్దార్ రమేశ్



సీఎం చంద్రబాబుతో శ్రీభరత్, పల్లా శ్రీనివాసరావు

విశాఖకు క్రూయిజ్

అండమాన్‌కూ అవకాశం
మహానాడులో ఎంపీ ఎం.శ్రీభరత్

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి ఒక క్రూయిజ్ వస్తోందని, అది అండమాన్‌కు కూడా వెళ్లే అవకాశం ఉందని ఎంపీ ఎం.శ్రీభరత్ వెల్లడించారు. కడపలో జరుగుతున్న మహానాడులో బుధవారం ఆయన ప్రసంగించారు. పర్యాటక రంగం అభివృద్ధితో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం ప్రయత్నిస్తున్నారని, విదేశీ పర్యాటకులను రప్పించేందుకు ప్రణాళికలు తయారవుతున్నాయన్నారు. వైసీపీ హయాంలో రుషికొండపై పర్యాటక రిసార్ట్స్ కూలగొట్టారని, పర్యాటక కేంద్రమైన అరకును డ్రగ్స్ కేంద్రంగా తయారు చేశారని ఆరోపించారు. చంద్రబాబు వచ్చాక అరకు కాఫీకి మళ్లీ జాతీయ స్థాయిలో ప్రచారం చేస్తున్నారన్నారు. 2014-19 మధ్య ఏపీకి 23 కోట్ల మంది పర్యాటకులు వచ్చారని, ఏటా విశాఖ, అరకు ఉత్సవాలు నిర్వహించేవారని, వైసీపీ ప్రభుత్వం అవన్నీ నిలిపివేసిందన్నారు. కొత్త పర్యాటక పాలసీ ద్వారా రెండు లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు.

నెత్తురోడుతున్న రోడ్లు

నగరంలో మళ్లీ పెరుగుతున్న ప్రమాదాలు

- నిబంధనలు పాటించని వాహన చోదకులు
- త్వరగా వెళ్లిపోవాలనే ఆత్రుతతో సిగ్నల్ జంపింగ్
- ఎదుటి వాహనాలను పట్టించుకోకుండా డ్రైవింగ్
- ఇష్టారాజ్యంగా భారీ వాహనాల రాకపోకలు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పోలీసులకు కానరాని శ్రద్ధ
- పెండింగ్ చలాన్‌లు కట్టించడంపైనే దృష్టి



మారుతి సర్కిల్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) **నగరంలో మళ్లీ రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రతిరోజూ ఎవరో ఒకరు ప్రాణాలు కోల్పోతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా రహదారుల విస్తరణ జరగకపోవడం, వాహన చోదకుల నిర్లక్ష్యం... ప్రమాదాలకు కారణమవుతున్నాయి.**

రాష్ట్రంలోనే అతిపెద్దనగరంగా గుర్తింపు పొందిన విశాఖలో సుమారు 13 లక్షల వాహనాలు ఉన్నాయి. రోజురోజుకీ వాహనాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా రోడ్లు విస్తరించకపోవడంతో ట్రాఫిక్‌జామ్‌లు నిత్యకృత్యంగా మారాయి. నగరం మధ్య నుంచి వెళుతున్న జాతీయ రహదారిపై బోయిపాలెం నుంచి లంకెలపాలెం వరకూ 32 కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుచేశారు. అయితే వాహన చోదకులు ట్రాఫిక్ సిగ్నల్స్ జంపింగ్‌కు పాల్పడడం, సర్వీస్ రోడ్డు నుంచి హఠాత్తుగా జాతీయ రహదారిపైకి రావడం, హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడపడం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, పరిమితికి మించిన వేగంతో వాహనాలను నడపడం, రోడ్ల డిజైన్‌లో లోపాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద కూడళ్లను అభివృద్ధి చేయకపోవడం, నగరంలోకి రద్దీ సమయాల్లో భారీ వాహనాలు ప్రవేశించడం వంటివి ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. బుధవారం తెల్లవారుజామున సత్యం కూడలి వద్ద మర్రిపాలేనికి చెందిన బుగత రాము (35) ద్విచక్ర వాహనంపై మద్దిలపాలెం వైపు వెళుతుండగా, వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అదే ప్రాంతంలో ... మిగతా 4వ పేజీలో



దుక్కవానిపాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

గత మూడేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాలు

సం.	రోడ్డు ప్రమాదాలు	మరణాలు
2022	1,353	346
2023	1,180	209
2024	1,094	261
2025	625	134

(మే 27 నాటికి సుమారుగా)

కేకే లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

- ప్రమాద స్థలిని సందర్శించిన డీఆర్‌ఎం
- కేకే లైన్‌లో రైళ్లు రద్దు

....6వ పేజీలో



చందనోత్సవ ప్రమాద నిందితులకు బెయిల్ నిరాకరణ

- ఆ ముగ్గురిని గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేస్తారా?



సింహగిరిపై క్యూ లైన్ వద్ద గోడ కూలిన ప్రాంతం (ఫైల్)

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై చందనోత్సవ సమయంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందిన కేసులో ముగ్గురు ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదు కాగా, వారు ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా వారి అభ్యర్థనను జిల్లా న్యాయస్థానం బుధవారం తిరస్కరించింది. ఏప్రిల్ 30న జోడుభద్రాలు వద్ద గోడ కూలి ఏడుగురు మరణించగా.. ఆ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. ఎటువంటి అనుమతులు లేకుండా ... మిగతా 4వ పేజీలో

కాలుష్యం నుంచి విముక్తి

- అనధికార డంపింగ్ యార్డు చుట్టూ ప్రహరీ గోడ నిర్మించిన ఐలా కమిషనర్
- ఇప్పటికే అక్కడ ఉన్న చెత్త కాపులుప్పాడ యార్డుకు తరలింపు
- తిరుమలనగర్ వాసుల హర్షం



తిరుమల నగర్‌కు ఆనుకొని ఆటోనగర్ ఈ బ్లాకులో చెత్తను లారీలోకి ఎక్కిస్తున్న దృశ్యం



కూర్మన్నపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్, సిద్ధార్థ నగర్, పాత వడ్లపూడి, కాళింగుల వీధి, తారకరామా నగర్‌లను దీర్ఘకాలంగా వేధిస్తున్న చెత్త సమస్యకు పరిష్కారం లభించింది. ఐలా కమిషనర్ ఎ.కిషోర్ ఆదేశాల మేరకు బుధవారం నుంచి చెత్తను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించడం ప్రారంభించారు. ఆటోనగర్ బ్లాకులో పలు కర్మాగారాల నుంచి వెలువడే వ్యర్థాలను మూడేళ్ల నుంచి ఓ ఖాళీ స్థలంలో వేయడంతో డంపింగ్ యార్డుగా మారింది. పరిశ్రమల నిర్వాహకులతో పాటు వివిధ ప్రాంతాలవారు రాత్రి పూట వాహనాలలో వ్యర్థాలను తీసుకువచ్చి అక్కడ పడేసేవారు. ప్రతి శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో తిరుమలనగర్, సిద్ధార్థ నగర్, పాత వడ్లపూడి ప్రాంతాల వాసులు పొగతో ఇబ్బందిపడేవారు. వృద్ధులు, చిన్నారులు అస్వస్థతకు గురై శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొనేవారు. అక్కడ వ్యర్థాలను తొలగించాలని జీవీఎంసీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ఐలా అధికారులకు స్థానికులు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో జనవరి 28న తిరుమలనగర్‌లో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండా'గా కార్యక్రమంలో పాల్గొన్న అధికారుల దృష్టికి స్థానికులు ఈ సమస్యను తీసుకువచ్చారు. ఆ ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు. కార్పొరేటర్ ... మిగతా 4వ పేజీలో

బియ్యం కార్డుల్లో మార్పులు, చేర్పులకు దరఖాస్తుల వెల్లువ

ఇప్పటివరకూ 23,193 రాక

- ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్ల నమోదుకు 16,310 మంది దరఖాస్తు
- కొత్త కార్డుల కోసం 2,471 మంది, కార్డు విభజనకు 1,684 మంది..
- అనాథాశ్రమంలోని వృద్ధులూ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు: జేసీ మయూర్ అశోక్



విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): బియ్యం కార్డుల్లో మార్పులు, చేర్పులకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. ఈ నెల 7వ తేదీ నుంచి బుధవారం నాటికి 23,193 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కొత్తగా సభ్యులుగా చేరిక (ఇప్పటికే ఉన్న కార్డుల్లో) కోసం అత్యధికంగా 16,310 మంది దరఖాస్తు చేశారు. అలాగే కొత్తగా బియ్యం కార్డు కోసం 2,471 మంది, కుటుంబంలో కొంతమంది వేరు కాపురం పెట్టడంతో పాత కార్డులో ... మిగతా 4వ పేజీలో



పీఎంపాలెం క్రికెట్ స్టేడియం వద్ద కేక్ కట్ చేస్తున్న జడ్సీ కనక మహాలక్ష్మి, ఇతర శాఖల అధికారులు



భీమిలిలోని ఎమ్మెల్యే గంటా క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న స్వామి, కార్పొరేటర్లు చిన్నికుమారి లక్ష్మి, అప్పలకొండ



మధురవాడలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎన్‌టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పోలాకి శ్రీనివాసరావు, తదితరులు

తెలుగు ప్రజల ఆరాధ్య దైవం ఎన్‌టీఆర్

» వాడవాడలా ఎన్‌టీ రామారావు జయంతి
» నివాళి అర్పించిన పార్టీ శ్రేణులు

భీమునిపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్‌టీ రామారావు జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. భీమిలి పట్టణంలో 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ ఆధ్వర్యంలో చిన్నబజారు జంక్షన్‌లో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి నాయకులు స్వామి, 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బీచ్‌రోడ్‌లో వున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి నాయకులు స్వామి, కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్నికుమారిలక్ష్మి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అప్పలకొండ మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆరాధ్య దైవం ఎన్‌టీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు చురకల రమణ, గాడు సన్యాసినాయుడు, కాసరపు నాగరాజు, మారోజు సంజీవకుమార్, కొక్కిరి అప్పన్న, గిడుతూరి శ్రీనివాసరావు, గండిబోయిన పోలిరాజు, వియ్యపు పోతురాజు, యానాపు శ్రీను, వాసుపల్లి వంశీ, మట్టా దాసు, నక్కిళ్ల వెంకటరావు పాల్గొన్నారు. ప్రభుత్వ ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాలలోనూ ఎన్‌టీఆర్ జయంతి జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేఖ మాట్లాడుతూ ఎన్టీఆర్ దూరదృష్టి కలిగిన నాయకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి. ప్రసాదరావు, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలసలో...

తగరపువలస : తగరపువలసలోని అన్ని ప్రాంతాల్లోనూ ఎన్‌టీఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు.బ్యాంకు కాలనీలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి పూలమాల వేసినివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు బడిగంటి నీలకంఠం, నాయకులు పి. వెంకటరావు, చెట్ల రమణ, చిల్ల అప్పలరెడ్డి, డి. కృష్ణ పాల్గొన్నారు.అలాగే టీడీపీ విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పిట్ట సురేశ్ ఆధ్వర్యంలో రాజావీధిలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారు. అనంతరం పట్టణ ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంతల పైడిరాజు, కొసూరి రాంబాబు, కొప్పల కృష్ణ, సరగడ నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

మజ్జివలసలో...

భీమునిపట్నం (రూరల్) : మజ్జివలస కూడలిలో ఎన్‌టీఆర్ విగ్రహానికి పార్టీ మండల అధ్యక్షుడు రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకుడు నీలాపు సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మజ్జివలస, లక్ష్మీపురం గ్రామాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

జోడుగుళ్లపాలెం కూడలిలో...

విశాలాక్షినగర్ : జోడుగుళ్లపాలెం కూడలిలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి పార్టీ నాయకుడు వేజేళ్ల సుబ్బరాజు, 9వ వార్డు అధ్యక్షుడు అక్కబోయిన రాంబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, పేదలకు సీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నారావు,మైలపల్లి శ్రీను, వెంపాడ శ్రీనివాసరెడ్డి, ఉష, సత్య, ప్రభ, సుధ, మంగ , తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో...

మధురవాడ : తెలుగు వెలుగును ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్‌టీ రామారావుకు దక్కుతుందని ఏడో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ అన్నారు. మధురవాడ పీహెచ్‌సీ సమీపంలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సినీ రంగంతో పాటు రాజకీయంలో కూడా ఉన్నత శిఖరాలు అధిరోహించిన ఎన్‌టీఆర్ తెలుగు ప్రజల గుండెల్లో చిరకాలం ఉంటారన్నారు. అనంతరం పీహెచ్‌సీలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పిళ్లా నరసింగరావు, పీవీఎస్ఎన్ బాలాజీ, పిళ్లా రాము, దాసరి కాంతం, వనజ, బేగం పాల్గొన్నారు. మధురవాడ విద్యుత్ శాఖ కార్యాలయంలో కూడా ఎన్‌టీఆర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఈఈ పోలాకి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పీఎంపాలెంలో...

కొమ్మాది :పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు ఎన్‌టీఆర్ అని జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి అన్నారు. పీఎంపాలెం క్రికెట్ స్టేడియం దరి ఎన్‌టీఆర్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జోన్-2 ఈఈ శాంతిరాజు, సూపరింటెండెంట్ అప్పలరాజు సిబ్బంది పాల్గొన్నారు. ఐదో వార్డులోని పరదేశిపాలెం, రాజీవ్ గృహకల్ప కాలనీల్లో జరిగిన కార్యక్రమాల్లో కార్పొరేటర్ మొల్లి హేమలత మాట్లాడుతూ ఎన్‌టీఆర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్యదర్శి ఈగల రవి, నమ్మి శ్రీను, వియ్యపు నాయుడు, ఓలేటి శ్రావణ్, కురుమోజి గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : సాగర్‌నగర్ కూడలిలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు పార్టీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, బి. దొరబాబు, చెట్టుపల్లి సన్యాసిరావు, సారిపల్లి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తొమ్మిదో వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు చిన్న గోపి, ఎస్. మంగాదేవి, ఒమ్మి బాబూరావు, కాటూరి వీర్రాజు పాల్గొన్నారు.

సింహాచలంలో...

సింహాచలం : ఎన్‌టీ రామారావు తెలుగు ప్రజల మనసులో చిరస్మరణీయంగా ఉంటారని 98వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ అన్నారు. సింహాచలం ప్రధాన కూడలిలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు మాజీ అధ్యక్షుడు మేకా కాసుగోపాల్, సీనియర్ నాయకులు గుసిడి శంకరరావు, రాజనాల సత్యారావు, శీర కృష్ణారావు, పట్నాల ధర్మరాజు, గంగ్రెడ్డి వెంకటరమణ, తాలాడ రామారావు, పంచదార్ల సోమునాయుడు పాల్గొన్నారు.

ఆనందపురంలో....

ఆనందపురం :వేములవలస పూల మార్కెట్, ఎల్‌వీ పాలెంలో ఎన్‌టీఆర్ జయంతి ఘనంగా జరిగింది. నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, శ్రీనాథ నారాయణరావు, కొట్యాడ రెడ్డిబాబు, షిణగం పెద్ద రామారావు, కాకర సురేశ్‌కుమార్, మరుపిళ్ల సాయి జ్ఞానేశ్వర్, బమ్మిడి తారక్, కోరాడ రమణ పాల్గొన్నారు.

పద్మనాభంలో...

పద్మనాభం : పద్మనాభంలోనూ ఎన్టీఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ పార్కులో ఉన్న ఆయన విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాండ్రంగిలో కూడా ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ, తెలుగు మహిళ అధ్యక్షురాలు పావని, సర్పంచ్ రమణ పాల్గొన్నారు.



సింహాచలం : ఎన్‌టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు



పద్మనాభంలోని పార్కులో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

యోగా వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు

కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవానికి శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. జూన్ 21న ఉదయం 7.15 నుంచి 8.15 వరకు వేడుకలు జరుగుతాయని చెప్పారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 29 కి.మీ. పొడవునా కంపార్టుమెంట్లు ఉంటాయని, మొత్తం 1.75 లక్షల మంది కంపార్టుమెంట్లలో యోగాసనాలు వేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. మరో 75 వేల మందికి పార్కు హోటల్ నుంచి ఏయూ అవుట్ గేట్ మీదుగా ఇంజనీరింగ్ కళాశాల, బీచ్‌రోడ్‌లో గీతం, గాయత్రి విద్యా సంస్థలు, రుషికొండకు ఆనుకుని బీచ్ లోపలకు వెళ్లే రోడ్, ఇంకా ఖాళీ ప్రదేశాలు, మైదానాలు, బీచ్‌లో ఇసుక తిన్నెలపై ఆసనాలు వేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాళీమాత గుడి వద్ద ప్రధాన వేదిక ఉంటుందని, ఈ వేదికలో 15 వేల మంది పాల్గొంటారన్నారు. ఇదే వేదికకు ప్రధాని మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు. ప్రధాని, సీఎం 15 నిమిషాల ప్రసంగాలు ఉంటాయని పేర్కొన్నారు. కాళీమాత గుడి నుంచి భీమిలి వరకు 19 కి.మీ. పొడవునా బీచ్‌లో రెండువైపుల, మరో 10 కి..మీ పొడవునా ఒకవైపు మాత్రమే వేడుకలు జరుగుతాయన్నారు. ఈ పది కిమీ పొడవునా రోడ్‌కు రెండోవైపు ప్రజలు పాల్గొనేందుకు వీలుగా రావడానికి, వాహన రాకపోకలకు వినియోగిస్తామన్నారు. ఉదయం 5.30 గంటలకు ప్రతిఒక్కరూ తమకు కేటాయించిన ప్రాంతానికి చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సచివాలయాల వారీగా జనాలను వాహనాల్లో ఆయా ప్రాంతాలకు తరలిస్తామని,సొంత వాహనాలు ఉండేవారు ముందుగానే వేదికలు ఏర్పాటు చేసే ప్రాంతానికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనేవారికి మ్యాట్‌లు, టీషర్టులు కేంద్రం సరఫరా చేస్తోందన్నారు. ఆ రోజు ఉదయం వర్షం వస్తే ప్రధాని, గవర్నర్, సీఎం, ఇతర ప్రముఖుల కోసం ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఇందుకు వాటర్ ప్రూఫ్ షీట్లు, హ్యాంగర్లతో షెడ్లు వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనేవారికి తాగునీరు, స్నాక్స్ అందజేస్తామన్నారు. అన్ని విభాగాల అధికారులతో పలు కమిటీలు వేసామని, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మరికొన్ని కమిటీలు పనిచేస్తున్నాయని తెలిపారు.

తగ్గిన ఉక్కు ఉత్పత్తి

... 3వ పేజీ తరువాయి

మొదలు కాకముందు రోజుకు 14 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేశారు. సమ్మె మొదలైన తరువాత అది 10-11 వేల టన్నులు మాత్రమే వస్తోంది. ప్రస్తుతం శాశ్వత ఉద్యోగులతో 12 గంటల డ్యూటీ చేయిస్తున్నారు. తీసేసిన కార్మికులు మాత్రమే బయట సమ్మె చేస్తున్నారు. మిగిలిన 8 వేల మంది విధులకు హాజరవుతున్నారు. వారితో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల నుంచి పూర్తి ఉత్పత్తి (14 వేల టన్నులు) తీయడమే కష్టంగా ఉంటే... మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభిస్తే అక్కడ పనులు ఎవరు చేస్తారని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఎన్నాళ్లు శాశ్వత ఉద్యోగులతో 12 గంటల డ్యూటీ చేయిస్తారని నిలదీస్తున్నారు.

కార్మికులపై అసత్య ప్రచారం

స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఆరా తీస్తోంది. కలెక్టర్ మంగళవారం రాత్రి సీఎండీని, ఇతర ఉన్నతాధికారులను పిలిచి ప్లాంటులో పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్లాంటులో జరుగుతున్న ప్రమాదాల గురించి ప్రస్తావన రాగా కార్మికులే కావాలని ప్లాంటు పరికరాలకు నష్టం కలిగిస్తున్నారంటూ అధికారులు చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది. కడపలో మహానాడులో ఉన్న సీఎం చంద్రబాబును కలిసి ప్లాంటు పరిస్థితి వివరించేందుకు సీఎండీ, ఇతర ఉన్నతాధికారులు అక్కడికి వెళ్లారు.

పోలీసులు అంతా అక్కడే

స్టీల్‌ప్లాంటు గేటు వద్ద కాంట్రాక్టు కార్మికుల ఆందోళన రోజురోజుకూ ఉధృతమవుతోంది. తమకు ఉపాధి పోయిందని, కుటుంబాలతో సహా ఆత్మహత్య చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు. పరిపాలనా భవనం లోపలకు వెళ్లడానికి యత్నిస్తున్నారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు భీమిలి, సిటీ పోలీసు అధికారులందరినీ స్టీల్ ప్లాంటుకే తరలించారు.

నెత్తురోడుతున్న రోడ్లు

... 3వ పేజీ తరువాయి

ఈనెల 23న ద్విచక్ర వాహనంపై వెళుతున్న వైద్య విద్యార్థిని కారు ఢీకొనడంతో మృతిచెందింది. ఈనెల 24న సంగివలస వద్ద రహదారి దాటుతున్న దీవీస్ ఉద్యోగిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది.

బ్లాక్‌స్పాట్లపై నిర్లక్ష్యం

ఈఏడాది మొదట్లో కాస్త తగ్గినట్టు కనిపించిన ప్రమాదాలు ఇటీవల పెరుగుతున్నాయి.నగరంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న 68 ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో రాత్రిపూట లైటింగ్‌కు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలు, పొదలను తొలగించారు. బ్లాక్‌స్పాట్‌ల వద్ద లైటింగ్ పెంచారు. హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేయడంతో పాటు ఒక కానిస్టేబుల్‌ను రాత్రిపూట అక్కడ విధుల్లో ఉంచేవారు. దీని వల్ల ఈ ఏడాది మొదట్లో రోడ్డు ప్రమాదాలు తగ్గినట్టు కనిపించాయి. తర్వాత ట్రాఫిక్ పోలీసులు నిర్లక్ష్యం వహించడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2022లో 1,353 ప్రమాదాలు జరగ్గా 346 మంది మృతి చెందారు. 2023లో 1,180 రోడ్డు ప్రమాదాలు జరిగి 209 మంది మరణించారు. 2024లో రోడ్డు ప్రమాదాలు 1094కి తగ్గగా, మరణాల సంఖ్య మాత్రం 261కి పెరిగింది. ఈ ఏడాది మే 27 నాటికి నగరంలో దాదాపు 625 రోడ్డు ప్రమాదాలు జరిగినట్టు పోలీసులు చెబుతున్నారు. ఆయా ప్రమాదాల్లో 130 మంది మృతి చెందారు.

ట్రాఫిక్ పోలీసుల తీరుపై విమర్శలు

వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంతోపాటు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూడాల్సిన ట్రాఫిక్ పోలీసులు తమ బాధ్యతను విస్మరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూడలి వద్ద ఒకరు, లేదా ఇద్దరు సిబ్బంది ఉండి ట్రాఫిక్ విధులను నిర్వర్తించాల్సింది పోయి, ఐదు నుంచి పదిమంది వరకూ ఒకచోట గుమికూడుతున్నారు. ఆ మార్గంలో వచ్చిపోయే వాహనాలను అకస్మాత్తుగా ఆపుతున్నారు.ఆయా వాహనాలకు ఏమైనా పెండింగ్ చలాన్‌లు ఉన్నాయా? అని మొబైల్ యాప్‌లో తనిఖీ చేస్తున్నారు.పెండింగ్ చలాన్‌లు ఉంటే అక్కడికక్కడే కట్టిస్తున్నారు. ట్రాఫిక్ జామ్ అయిపోయినా సరే తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారి కోసం ఎదురుచూస్తూ కనిపించగానే ఫొటోలు తీయడం, పెండింగ్ చలాన్‌లు కట్టించడంలోనే నిమగ్నమై పోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధి కల్పించకపోతే చంపేయండి

... 3వ పేజీ తరువాయి

కోసం సర్వం త్యాగం చేశామని, భూములు, ఇళ్లు కోల్పోయామని, శాశ్వత ఉపాధి లేక కూలి పనులు చేస్తున్నామని, ఇప్పుడు అవి కూడా లేవంటున్నారని అక్కడకు వచ్చిన అధికారులు ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కల్పించకపోతే తమను చంపేయాలన్నారు. ఇదిలా వుండగా ప్లాంటులో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

భవిష్యత్తు కార్యాచరణ ప్రకటన రేపు

గురు, శుక్రవారాల్లో కూర్మన్నపాలెం దీక్షా శిబిరం వద్ద భారీఎత్తున నిరసన కార్య క్రమాలు చేపడతామని కాంట్రాక్టు కార్మిక నాయకులు తెలిపారు. శుక్రవారం ఆర్‌ఎల్‌సీ (రీజనల్ లేబర్ కమిషనర్) సమక్షంలో చర్చలు జరగనున్నాయని, చర్చల అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

నాయకులపై కేసు నమోదు

స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ భవనం ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళ, బుధవారాల్లో కాంట్రాక్టు కార్మికులు అడ్మిన్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. అడ్మిన్ భవనం ప్రవేశ, నిష్క్రమణ గేట్ల వద్ద చేపట్టిన ముట్టడి కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, కార్పొరేటర్ గంగారావు, నాయకులు సత్యనారాయణ, కేఎం శ్రీనివాస్, నమ్మి రమణ, జి.శ్రీనివాస్, ఆర్‌టీ రాజులతో పాటు సుమారు 200 మంది కార్మికులు పాల్గొని రాకపోకలు సాగించే ఉద్యోగులకు ఇబ్బందులు కలిగించారని పేర్కొంటూ ప్లాంట్ జీఎం లలన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనేక కార్పొరేట్ కార్యకలపాలు, అనేక విభాగాలు కలిగిన అడ్మిన్ భవనం వద్ద ఇటువంటి కార్యక్రమాలను చేపట్టడం వల్ల విధులకు అంతరాయం వాటిల్లుతుందని, భవిష్యత్తులో ఇటువంటివి చేయకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై పోలీసులు పైన పేర్కొన్న వారిపై కేసు నమోదు చేశారు.

డబుల్ డెక్కర్ బస్సులు వస్తున్నాయ్..

... 3వ పేజీ తరువాయి

సీఎస్సార్ నిధులతో కొనుగోలు చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ నిర్ణయించారు. ఈ రెండు బస్సుల కొనుగోలుకు స్మార్ట్ సిటీ కార్పొరేషన్ పిలిచిన టెండర్లను ఈ నెల 31న తెరవనున్నారు. టెండర్లు ఖరారయ్యాక వచ్చేనెలలో కొత్త బస్సులను కొనుగోలు చేసి బీచ్ రోడ్డులో ప్రజలు, పర్యాటకులకు అందుబాటులోకి తేనున్నారు. ఈ బస్సులకు ఆదరణ ఉండేలా ప్రత్యేకంగా టిక్కెట్లను విక్రయించాలని అధికారులు నిర్ణయించారు. టిక్కెట్ కొనుగోలు చేస్తే రోజంతా ఆ టికెట్‌ను మూడు బస్సుల్లో వినియోగించుకునే అవకాశం కల్పిస్తారు. టికెట్ కొనుగోలు చేసిన వ్యక్తి డబుల్ డెక్కర్ బస్సుల్లో ఏదో ఒక బస్సు ఎక్కి, బీచ్ రోడ్డులో తనకు కావాల్సిన చోట దిగడంతో పాటు అక్కడ గడిపిన తరువాత అక్కడి నుంచి మరో బస్సులో ఎక్కి వేరే చోటకు వెళ్లడానికి అవకాశం కల్పిస్తారు. మూడు డబుల్ డెక్కర్ బస్సులూ బీచ్ రోడ్డులో నిరంతరం రాకపోకలు సాగిస్తుంటాయి.

అగ్నిప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్

సాగర్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఐఎన్‌ఎస్ కళింగ, గీతం వర్సిటీ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గీతం వీసీ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా, నౌకాదళం భద్రతా విభాగం అధికారులు పాల్గొన్నారు.

రాకాసి అలలు!

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం,మాన్‌సూన్ కరెంట్ ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. తీరం దిశగా అలలు ఎగిసిపడుతూ వస్తున్నాయి. దీంతో బుధవారం సముద్రపు అలలు తీరంలోని రక్షణ గోడకు సమీపం వరకు వచ్చాయి. ఒక్కసారిగా ఆర్కే బీచ్‌లోని ఇసుకతిన్నెలను దాదాపుగా సముద్రం నీటితో కప్పేశాయి. అలల ధాటికి ఇసుక భారీగా కోతకు గురైంది. ఈ ప్రాంతంలో ఎక్కువగా సందర్శకులు నిత్యం తిరుగుతూ ఉంటారు. అలల ధాటికి బీతిల్లి సందర్శకులెవరూ బీచ్ రోడ్డు నుంచి లోపలకు రాలేదు. ఆర్కే బీచ్‌లో వ్యూ పాయింట్‌కు ఆనుకుని సముద్రంలో వ్యాపారం కోసం వేసుకున్న స్టాల్స్ వరకు అలలు రావడంతో దుకాణదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కాగా కురుసుర మ్యూజియం వద్ద సముద్రం భారీగా కోతకు గురైంది. గత ఏడాది డిసెంబరులో కురుసుర మ్యూజియానికి ఉత్తర వైపుగా భారీగా కోత ఏర్పడింది. ఈ ఏడాది రుతుపవనాలు ప్రవేశిస్తూనే కురుసుర వద్ద తీరం కోతకు గురికావడంతో సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడనాలు, మాన్‌సూన్ కరెంట్ ఉధృతంగా ఉన్నప్పుడు తీరం కోతకు గురవుతుందని, అందువల్ల కోత నివారణకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టాలని సముద్ర అధ్యయన నిపుణులు కోరుతున్నారు.

కానిస్టేబుల్‌కు సీపీ ప్రశంసలు

సింహాచలం, మే 28 (ఆంధ్రజ్యోతి) : నేరస్తుడ్ని పట్టుకోవడంలో పెందుర్తి పోలీసులకు సహకరించిన కానిస్టేబుల్ కసిరెడ్డి సురేంద్రబాబును సీపీ శంఖబ్రత బగ్చీ ప్రశంసించారు.నల్గొండ జిల్లాకు చెందిన గజ్జెల శ్రీనివాసరెడ్డి అనే బైకు దొంగకు సంబంధించి కచ్చితమైన సమాచారాన్ని పెందుర్తి పోలీసులకు ఆయన అందించినందుకు సీపీ రివార్డు ఇచ్చారు. 2021లో విజిలెన్స్ విభాగంలో పని చేస్తున్న సమయంలో సురేంద్రబాబుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారం ఇచ్చింది.

దరఖాస్తుల వెల్లువ

... 3వ పేజీ తరువాయి

తమ పేర్లు తీసి కొత్తగా కార్డు ఇవ్వాలంటూ 1,684 మంది, కార్డు నుంచి సభ్యుల పేర్లను తొలగించాలంటూ 1,222 మంది, చిరునామా మార్పు కోసం 948 మంది, ఆధార్ నంబర్‌తో బియ్యం కార్డుకు అనుసంధానంలో తప్పుల సవరణకు 508 మంది, రేషన్ దుకాణాల రెన్యువల్‌కు 45 మంది, కార్డు సరండర్ చేస్తామని ఐదుగురు దరఖాస్తు చేశారు. దరఖాస్తుల స్వీకరణకు ఇంకా గడువు ఉన్నందున భారీగా వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

అనాథాశ్రమంలో వృద్ధులకు బియ్యం కార్డు : జేసీ

బియ్యం కార్డులో మార్పులు, చేర్పులకు సంబంధించి జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పలు సూచనలు చేస్తూ ప్రకటన విడుదల చేశారు. అనాథాశ్రమంలో ఉండే వృద్ధులు కొత్తగా బియ్యం కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అదేవిధంగా కొత్త కార్డుకు ఈకేవైసీ పూర్తి చేసుకున్నవారు మరోసారి దరఖాస్తు చేయనవసరం లేదని పేర్కొన్నారు. వచ్చేనెలలో క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్‌కార్డులు లబ్ధిదారుల ఇళ్లకు పంపడం జరుగుతుందన్నారు. వివాహమైనా, ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లు కార్డు నుంచి తొలగించే ఆప్షన్ అందుబాటులోకి వచ్చిందన్నారు. 15 ఏళ్లు దాటిన పిల్లలను కార్డులో చేర్చవచ్చునని, ప్రభుత్వ పింఛన్ తీసుకుంటే కార్డుకు అర్హులు కారని, కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ/ప్రైవేటు ఉద్యోగం చేస్తూ నెలకు నగరంలో రూ.12 వేలు, గ్రామీణ ప్రాంతంలో రూ.10 వేలు జీతం వస్తే కుటుంబం మొత్తం కార్డు పొందేందుకు అర్హులుకారని ఆయన పేర్కొన్నారు. అలాగే నాలుగు చక్రాల వాహనం కలిగివుండడం, మూడెకరాల పల్లపు భూమి, మొత్తం 10 ఎకరాల భూమి కలిగివుంటే ఆ కార్డుదారుని అనర్హులుగా పరిగణించడం జరుగుతుందన్నారు.

గ్రీన్ బెల్ట్‌ను పునరుద్ధరించండి

జోన్ -2 జడ్సీ కనకమహాలక్ష్మీ ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎండాడ,మే 28 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్ బెల్ట్‌ను పునరుద్ధరించాలని జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. బుధవారం అధికారులతో కలిసి వరహాగిరినగర్‌లో ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రీన్ బెల్ట్‌లో ఉన్న భవన నిర్మాణ సామగ్రిని తక్షణమే తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే గ్రీన్ బెల్ట్ చుట్టూ కంచె వేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని సంరక్షించాలని, ఎవరైనా ఈ ప్రాంతంలో మెటిరీయల్ వేస్తే చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం వైఎల్‌పీ లేఅవుట్, గొల్లల ఎండాడ, రాజీవ్‌నగర్ ముబారక్ కాలనీ నుంచి బీచ్ రోడ్డుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా స్థలాలు కోల్పోయేవారికి టీడీఆర్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఈఈ కె. శాంతిరాజు, ఏసీపీ ఎం. తిరుమలరావు, టీపీవో బాలరాజు, ఏఈ శ్రీనివాస్. కార్పొరేటర్ లొడగల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



ఎండాడలో మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న జడ్సీ కనకమహాలక్ష్మి

బెయిల్ నిరాకరణ

... 3వ పేజీ తరువాయి

అక్కడ గోడను నిర్మించారని, పునాదులు లేకపోవడం వల్ల అది కూలిపోయి ప్రమాదం జరిగిందని తేల్చారు. ఈ పనులను పర్యవేక్షిస్తున్న దేవస్థానం ఈఈ దండు గణపతి శ్రీనివాసరాజు, పర్యాటక శాఖ ఈఈ కలిమి రమణతో పాటు కాంట్రాక్టర్ కె. లక్ష్మీనారాయణ నిర్లక్ష్యం కూడా ఉందని నివేదికలో పేర్కొన్నారు. వారిపై క్రిమినల్ కేసులు పెట్టి విచారణ జరపాలని సూచించారు. ఈ మేరకు ప్రభుత్వం కేసులు నమోదు చేయాలని ఆదేశించడంతో దేవస్థానం పరిపాలనాధికారి గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో వారిపై భారత న్యాయ సంహిత సెక్షన్లు 105, 125ల కింద కేసులు పెట్టారు. ఈ ముగ్గురు అరెస్టు కాకుండా ఉండేందుకు ముందస్తు బెయిల్ కోసం జిల్లా న్యాయస్థానంలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే గోడ నిర్మాణంలో నిర్లక్ష్యం వహించారని, కేసు ఇంకా విచారణలో ఉందని, బెయిల్ ఇవ్వడం సరికాదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు వాదనలు వినిపించడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు వారి బెయిల్ పిటిషన్ తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. ఈనేపథ్యంలో గోపాలపట్నం పోలీసులు వారిని అరెస్టు చేస్తారా? హైకోర్టుకు అప్పీల్ చేసుకునే అవకాశం కల్పిస్తారా ? అన్నది చూడాలి.

పుస్తక ప్రదర్శన

సింహాచలం, మే 28 (ఆంధ్రజ్యోతి) : అడివివరం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రంథాలయాధికారి నరసింహం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

కోతకు గురైన తీర ప్రాంతం పరిశీలన

భీమునిపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బోయవీధి సమీపంలో కోతకు తీరం గురైన ప్రదేశాన్ని జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు బుధవారం పరిశీలించారు. ముందు జాగ్రత్తగా ఈ ప్రాంతంలో సిమెంట్ క్యూబ్‌లను ఏర్పాటు చేయించారు.

జూలై 14 నుంచి గీతం దూర విద్య పరీక్షలు

సాగర్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) ద్వారా వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు జూలై 14వ తేదీ నుంచి పరీక్షలు జరగనున్నట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పూర్తి వివరాలకు దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రతించాలని సూచించారు.

నేడు గ్రేడ్ -2 హెచ్‌ఎంల పదోన్నతి కౌన్సెలింగ్

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి విశాఖ జిల్లాలో జడ్పీ, మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్ గురువారం ఉదయం సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో నిర్వహించనున్నట్టు డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌ఎంల బదిలీ ఉత్తర్వులు వెలువడిన తరువాత మిగిలిన ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. పదోన్నతుల కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసిన వారంతా తమ రిజిస్టర్ మొబైల్ నంబర్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు.

కాలుష్యం నుంచి విముక్తి

... 3వ పేజీ తరువాయి

బొండా జగన్ ఈ సమస్యను ఏఎంహెచ్‌ఓ కిరణ్ కుమార్, ఐలా కమిషనర్ విల్లి కిషోర్‌ల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఐలా కమిషనర్ కిషోర్ సుమారు రూ.7 లక్షలతో డంపింగ్ యార్డుగా మారిన స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేశారు. ఇప్పటికే అక్కడ ఉన్న చెత్తను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. చెత్తను పూర్తిగా తరలించాక, సీసీ కెమెరాలను కూడా ఏర్పాటుచేయనున్నట్టు ఐలా కమిషనర్ అయిన విల్లి కిషోర్ తెలిపారు.తమ సమస్యకు పరిష్కారం చూపిన 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికకు, ఐలా కమిషనర్‌కు, కార్పొరేటర్ బొండా జగన్‌కు తిరుమల నగర్ కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.


వెంకోజీపాలెం : హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న టీడీపీ 15వ వార్డు నేతలు


పెదవాల్తేర్ : ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వెలగపూడి ప్రతాప్ రుద్ర, కార్పొరేటర్ నొల్లి నూకరత్నం


ఎంవీపీ కాలనీ : నగర శాఖా గ్రంథాలయంలో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న లైబ్రేరియన్ ఉమామహేశ్వరరావు


సిరిపురం : ఎన్టీఆర్ శ్రీకృష్ణుడి వేషధారణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కళారాధన పీఠం వ్యవస్థాపకులు ఎస్ఎల్ఎన్ స్వామి

స్ఫూర్తి ప్రదాత ఎన్టీఆర్

- జయంతి వేడుకలో కొనియాడిన పలువురు వక్తలు
- టీడీపీ నేతలు, కార్యకర్తలు, నందమూరి అభిమానుల మధ్య వేడుకలు
- ఘనంగా నివాళులు
- పలు చోట్ల సేవా కార్యక్రమాలు

వెంకోజీపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ప్రముఖ సినీ నటుడు ఎన్టీఆర్ జయంతి వేడుకలను బుధవారం టీడీపీ శ్రేణులు. నందమూరి అభిమానులు ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల నిర్వహించిన వేడుకల్లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కొన్ని చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించి తమ అభిమాన నాయకుడిపై ప్రేమాభిమానాలు వ్యక్తం చేశారు.

వెంకోజీపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పలువురు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్ రుద్ర పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కేక్‌ను కట్ చేసి, వృద్ధులకు పండ్లు, చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మళ్ల వెంకట అప్పారావు, కె.మహేష్, మెకానిక్ నారాయణ, నరేంద్ర, బోను సూరిబాబు, పెంటకోట ప్రకాష్, శరగడం సుధాకర్, శంకర్, కర్రి గౌరీ, మళ్ల పోలిరాజు, మళ్ల కనకరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే 16వ వార్డులోని ఇసుకతోట, రజకవీధిలో టీడీపీ వార్డు అధ్యక్షులు నారు గోపి, ముగడ వాసు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశాఖ మార్కెటింగ్ కమిటీ సభ్యురాలు నారు ఉమా, కార్యదర్శి బి.బంగారురాజు, సీనియర్ నాయకులు మొల్లి శంకర్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సిరిపురంలో..

సిరిపురం, మే 28 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడిగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా స్వర్గీయ నందమూరి తారకరామారావు తెలుగు ప్రజలకు అందించిన సేవలు మరవలేనివని అటువంటి మహావ్యక్తికి 'భారతరత్న' ప్రకటించాలని డాక్టర్ ఎన్టీఆర్ కళారాధన పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడలు ఎస్ఎల్ఎన్ స్వామి కోరారు. ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ప్రకటించాలని కోరుతూ ఇప్పటికే కేంద్రానికి వేలాది పోస్టుకార్డుల ద్వారా పూర్తి తమ కోరికను తెలియజేశామని తెలిపారు. ఎన్టీఆర్ సినీ జీవితం వజ్రోత్సవ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఆగస్టులో రజతోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళారాధనపీఠం సభ్యులు పాల్గొన్నారు.

పెదవాల్తేర్‌లో..

పెదవాల్తేరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్న ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్ రుద్ర పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. పేద ప్రజలకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయకులు తేడ్డు రాజు, పైడిరాజు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అలాగే జీవీఎంసీ 20వ వార్డు తెలుగు మహిళా నాయకురాలు బైరెడ్డి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాడీ, దేవి, శ్రీదేవి, చిల్ల గోపి, కాకి శివ, కంబాపు శివారెడ్డి, మామిడి సురేష్, పి.శ్రీను, సిహెచ్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

18వ వార్డులో..

ఎంవీపీ కాలనీ, మే 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డులో కార్పొరేటర్ గొలగాని మంగవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్ రుద్ర పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేకు కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు స్థాయి తెలుగుదేశం నేతలు పాల్గొన్నారు.


13వ వార్డులో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సునీత, వెలగపూడి ప్రతాపరుద్ర తదితరులు

శాఖా గ్రంథాలయంలో..

అలాగే ఎంవీపీ కాలనీలోని నగరశాఖ గ్రంథాలయంలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఉమమాశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సర్వశిక్ష అభియాన్ ఆకాడమిక్ అధికారి లక్ష్మీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు సమ్మర్ ఒరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జూన్ 21న నిర్వహించే యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాలు నేర్పిస్తున్నట్టు గ్రంథాలయాధికారి తెలిపారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, మే 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి రవీంద్రనగర్‌లో గల నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పదో వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, కల్చర్ ఇన్‌చార్జి మద్దిల రాజేష్ ధనలక్ష్మి, కాల్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే 11వ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పేపరు నాయుడు, సీనియర్ నాయకుడు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వెలగపూడి ప్రతాప్ పాల్గొని అన్న సమారాధన ప్రారంభించారు.

రామ్‌నగర్‌లో..

రామ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : రామ్‌నగర్‌లో ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలు ఘణంగా నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి ఆలయం జంక్షన్‌లో ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద టీడీపీ 28వ వార్డు ఇన్‌చార్జు నక్క కనకరాజు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే రామకృష్ణబాబు కుమారుడు ప్రతాప్ రుద్ర, కార్పొరేటర్ గొలగాణి మంగవేణి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. కార్యక్రమంలో గొలగాని పోలారావు, నడిగట్ల శంకరరావు, ఉరుకూటి పైడిరాజు, జోకర శంకర్, శ్యామల, టి.లక్ష్మి, ఆశాన మంగమ్మ, పలువురు నేతలు, కార్యకర్తలు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి


ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ మేయర్ గోవిందరాజు, ఏడీసీ ఎస్ఎస్ వర్మ, సీఎంహెచ్‌వో నరేష్‌కుమార్ తదితరులు

వెంకోజీపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : పేదవాడికి కూడు, గూడు కల్పించిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు పేర్కొన్నారు. బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో ఎన్టీఆర్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎన్వీ నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, ఫైనాన్స్ అడ్వైజర్ మల్లికాంబ, డీపీవో ఫణిరామ్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏలో..

సిరిపురం, మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని దశదిశలా వ్యాప్తి చెందేలా చేసిన గొప్పవ్యక్తి ఎన్టీఆర్ అని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అన్నారు.బుధవారం వీఎంఆర్డీఏ కార్యాలయంలో నందమూరి తారక రామారావు 102వ జయంతిని నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ప్రణాళికాధికారి శిల్పా, ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, డీఎఫ్ఓ సుజాతా శివానీ, ఎస్టేట్ అధికారి దయానిధి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు

ఏయూలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు


ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను ఏయూలో అధికారులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్‌టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, దూరవిద్య డైరెక్టర్ ఎన్.విజయమోహన్, కామర్స్ మేనేజిమెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి, ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందం, డాక్టర్ జి.రవికుమార్, డొక్కర శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే, విద్యా విభాగాధిపతి ప్రొఫెసర్ షారోన్ రాజు ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పోషకాహారాన్ని అందించారు.

విశాఖ సెంట్రల్ జైలుకు తిరిగి వచ్చిన ఉగ్రవాద సానుభూతిపరులు

ఆరిలోవ, మే 28(ఆంధ్రజ్యోతి): విజయనగరంలో పేలుళ్లకు కుట్ర చేసి పోలీసులకు పట్టుబడిన ఉగ్రవాద సానుభూతిపరులు సిరాజ్, సమీర్‌లు పోలీస్ కస్టడీ ముగించుకొని తిరిగి బుధవారం విశాఖపట్నం సెంట్రల్ జైలుకు వచ్చారు. ఈ కేసులు వారిని విచారించి, అదనపు సమాచారం రాబట్టేందుకు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వారిని వారం రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని విజయనగరం పోలీసులు కోరడంతో కోర్టు అనుమతించిన సంగతి తెలిసిందే. ఆ మేరకు వారిని ఇక్కడి నుంచి తీసుకెళ్లి అన్ని వివరాలు రాబట్టిన పోలీసులు కస్టడీ గడువు ముగియడంతో తిరిగి విశాఖకు తీసుకువచ్చి సెంట్రల్ జైలుకు అప్పగించారు. విచారణలో అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పినట్టు సమాచారం ఉందని జైలు సూపరింటెండెంట్ మహేష్ బాబు తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో యువతి అదృశ్యమైన కేసును నమోదు చేశారు. సీఐ మురళీ తెలిపిన వివరాల మేరకు.. పెదవాల్తేరు కాగితాలవారి వీధికి చెందిన తుంపాల వేణుగోపాల్ తన కుమార్తె హర్షిత(22) ఈ నెల 26 అర్ధరాత్రి నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిందని, పిడింట్ల శ్రీనివాస్ అనే యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వివిధ చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హెడ్‌సీ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేసు కుక్కలపై జూలో చిత్రలేఖన పోటీలు


చిత్రలేఖనం వేస్తున్న ఓ విద్యార్థిని


మోటులో ఉన్న రేసుకుక్కలు

ఆరిలోవ, మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ రేసు కుక్కల (ధోల్) దినోత్సవం సందర్భంగా ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలలో బుధవారం విద్యార్థులకు చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగ జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ రేసు కుక్కలు అంతరించిపోయే ప్రాణుల జాబితాలో ఉన్నాయన్నారు. వీటినే ఆసియాటిక్ వైల్డ్ డాగ్స్ అంటారని తెలిపారు. పర్యావరణ సమతౌల్యాన్ని పరిరక్షించడంలో ఇవి ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. ఈ సందర్భంగా చిన్నారులురేసు కుక్కల జీవన శైలి, నివాస ప్రాంతాల అంశాలపై చిత్రలేఖనంలో వ్యక్తీకరించారు. చిన్నారుల వేసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. పోటీలో పలువురు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని అమ్మమ్మపై దాడి

ఎంవీపీ కాలనీ, మే 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగడానికి అమ్మమ్మ డబ్బులివ్వలేదన్న కోపంతో ఆమె తలపై మోదడంతో తీవ్ర గాయాలపాలై ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలా ఉన్నాయి.ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరు అప్పుఘర్ వద్ద నివాసం ఉంటున్న కోడ మర్రమ్మ(80) తన మనమడు పి.మహేష్ తనపై దాడి చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిత్యం మద్యం తాగి, ఇంట్లో ఇబ్బందులు పెడుతుంటాడని, మంగళవారం రాత్రి బాగా మద్యం తాగి, ఇంకా డబ్బులు కావాలని అడిగాడని, లేవని చెప్పడంతో స్టీలు జగ్గుతో తలపై మోదాడని పేర్కొంది. తీవ్ర గాయాలతో ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం),సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం)
- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **నిశ్శబ్దప్రేమ** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం),
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: రమాదేవి, సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 16, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 18, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 32, బీరకాయలు 36, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 15, క్యారెట్ 38 దొండకాయలు 20, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది)54, బరబాటి 30, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80,బద్దచిక్కుడు 40, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 30, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ఐపీఆర్‌లో నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యం

- ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు


ఐపీఆర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులతో రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్) నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్య తనిస్తూ వాటిని ప్రోత్స హిస్తోందని ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు అన్నారు. ఏయూలో డీపీఐఐటీ, ఐపీఆర్ చైర్ ఆధ్వర్యంలో ఏయూలో నిర్వహించిన పీజీ డిప్లొమా ఇన్ ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మేధో హక్కుల పరిరక్షణకు ఐపీఆర్ చేస్తున్న కృషి ప్రశంసనీయమైనదన్నారు. ఏడాది కాల వ్యవధి కలిగిన ఈ కోర్సును పలువురు వైద్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇంజనీర్లు, ఉన్నత విద్యావంతులు చేరి పూర్తి చేయడం పట్ల ఆయన ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐపీఆర్ చైర్ పూర్వ డైరెక్టర్ ప్రొఫెసర్ పురుషోత్తం, రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ రాంబాబు, డాక్టర్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వైభవ వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

వెంకోజీపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని రామాలయంలో వేంచేసి యున్న వైభవ వేంకటేశ్వరస్వామి(ముడుపుల వెంకటేశ్వరస్వామి) ఆలయం తృతీయ వార్షికోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ 7.30 గంటలకు అర్చన సేవా, విశ్వక్సేన పూజ, భగవత్ పుణ్యాహవాచనము, పరిషత్ విజ్ఞాపన, రక్షా సూత్రధారణ, మండపారాధన, అష్టోత్తర శత కలశారాధన, స్వామివారికి అష్టోత్తర శతకలశాభిషేకం, విశేష హోమాలు చేసి తదుపరి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామివారి కల్యాణ మహోత్సాన్ని జరిపారు. భక్తులంతా పాల్గొని గోవింద నామాన్ని జపించారు. ఆఖరిగా పుష్పాంజలి పవళింపు సేవతో వేడుకలను ముగించారు. ఆలయ అర్చకులు నాళ్ల చెరువు రామకృష్ణాచార్యులు సారథ్యంలో పలువురు పండితులు భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పీలా కనకరాజు , ప్రధాన కార్యదర్శి కాళ్ల పోలినాయుడు, కార్యవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


వెంకన్న స్వామికి అభిషేకం


కలశ పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

మద్యం మత్తులో చాట్ బండి వ్యాపారిపై దాడి


యువకుడి దాడిలో ధ్వంసమైన చాట్‌బండి అద్దాలు


దాడికి పాల్పడిన యువకుడు మీసాల నాయుడు

వెంకోజీపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ యువకుడు విచక్షణ కోల్పోయి చాట్ వ్యాపారిపై దాడి చేశాడు. చాట్ బండి అద్దాలను పగులగొట్టి, వ్యాపారిపై దాడి చేసిన సంఘటన బుధవారం రాత్రి హెచ్‌బీ కాలనీ జ్యోతి వైన్స్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.

సింహాద్రిపురం కొండవాలు ప్రాంతానికి చెందిన మీసాల నాయుడు అనే యువకుడు ఇక్కడి జ్యోతి వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసుకుని, ఇక్కడే ఉన్న ఖాళీ ప్రదేశంలో మద్యం తాగాడు. ఆ తర్వాత చాట్ బండి వద్దకు వచ్చి చాట్ ఇమ్మని అడిగాడు. అయితే మద్యం మత్తులో ఉన్నాడని, తిన్న తరువాత డబ్బులు ఇవ్వడేమోనన్న అనుమానంతో చాట్ వ్యాపారి ముందుగా డబ్బులు ఇమ్మని అడిగాడు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో విచక్షణ కోల్పోయిన యువకుడు చాట్ బండి అద్దం పగులగొట్టి, వ్యాపారిపై చేయిచేసుకున్నాడు. ఈ విషయమై స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో బ్లూకోర్టు పోలీసు సురేష్ అక్కడికి చేరుకుని ఇరువురితో మాట్లాడి పరిస్థితి చక్కదిద్దారు. యువకుడు స్థానికుడే కావడంతో అతడి బంధువులు అందరూ అక్కడికి వచ్చి వ్యాపారితో మాట్లాడి యువకుడిని మందలించి నష్టపరిహారం చెల్లించేందుకు ఒప్పుకోవడంతో గొడవ వివాద సద్దుమణిగింది.

అయితే ఈ ప్రాంతంలో వైన్స్ షాపు వచ్చినప్పటి నుంచి ఇదే తరహాలో రోజూ ఏదో ఒక గలాటా కొనసాగుతూనే ఉందని, పోలీసులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాల వద్ద ఎవరైనా మద్యం సేవిస్తే వారిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారని స్థానికులు చెబుతూనే ఈ ప్రాంతంలో పోలీసుల నిఘా మరింత పెంచాలని కోరుతున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా ఖాళీ స్థలాలు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో యువకులు మద్యం సేవిస్తున్నారని, పోలీసులు కాస్త ఆ దిశగా దృష్టి నిలపాలని కోరుతున్నారు.

మహానాడులో టీడీపీ 15వ వార్డు నాయకులు


మహానాడు ప్రాంగణంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో టీడీపీ 15వ వార్డు నేతలు

వెంకోజీపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : కడపలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు 15వ వార్డు నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. మహానాడుకు వెళ్లిన నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, నగర ఎంపీ ఎం.శ్రీభరత్, తూర్పు నియోజవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబులను 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవి కుమార్‌లతో పాటు టీడీపీ నాయకులు అప్పారి గిరిబాబు, సురేష్, కర్రి రవి, సోని తదితరులు కలిసి ముచ్చటించారు.

ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

ఆరిలోవ, మే 28 (ఆంధ్రజ్యోతి) : దీనదయాళపురంలో గల ప్రభుత్వ బాలుర వసతిగృహంలో బుధవారం ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. గృహం సూపరింటెంట్ వీరయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పిల్లలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. పిల్లలకు మిఠాయిలను పంచి పెట్టారు.


వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడవాడలా ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేకు కోస్తున్న నాయకులు విజయకుమార్, కనకరాజు, వెల్లంకి భరత్ తదితరులు



కేజీహెచ్‌లో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ చిత్రంలో వైద్యాధికారులు



సీతంపేటలోని పౌర గ్రంథాలయంలో ఎన్టీఆర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కళారంగ ప్రముఖులు

మహారాణిపేట/డాబాగార్డెన్స్/జ్ఞానాపురం/కంచరపాలెం/అక్కయ్యపాలెం/సీతమ్మధార/మాధవధార, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలను అధికారికంగా, పార్టీ తరపున బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో కేక ఒకరికొకరు తినిపించుకొని, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పుచ్చా విజయ్‌కుమార్, నక్కా కనకరాజు, వెల్లంకి భరత్, పి.జయరాజ్, జాన్, నడిగట్ల శంకరావు, వానపల్లి గాయత్రీ కుమారి, జఫ్రుల్లా పాల్గొన్నారు. కేజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తన కార్యాలయంలో ఎన్టీఆర్ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఆసుపత్రి అధికారులు డాక్టర్ శ్రీహరి, డాక్టర్ మెహర్‌కుమార్, డాక్టర్ రాజేష్, వెంకటరమణ, సతీసుమతి, సూరిమంగరాజు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.సీతంపేటలోని ఏపీఈపీడీసీఎల్ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో డైరెక్టర్లు డి.చంద్రం, టి.వనజ, టీవీ సూర్యప్రకాశ్‌లు ఎన్టీఆర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీఫ్ మేనేజర్లు రామచంద్రప్రసాద్, డి.సుమన్ కల్యాణి, జె. శ్రీనివాసరావు, బి.అశోక్ కుమార్, పి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సీతమ్మధారలోని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు అరుణ్, దుర్గారావు, అనిల్ కుమార్, అరుణ, సత్యనారాయణ, భీమా నారాయణరావు, గిరీష్ తదితరులు పాల్గొన్నారు. 41వ వార్డులో ఐతి రవి బాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి నిరాశ్రయులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలను, వాటిని నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు కొనసాగిస్తున్న తీరును ప్రజలకు వివరించారు. సానబోయిన ఫ్రాన్సిస్, పిల్లి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు. 33వ వార్డులోని శాఖా గ్రంథాలయంలో అధికారి పి.వి.నూకరాజు ఆధ్వర్యంలో, 34వ వా



శాంతినగర్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న కార్మిక సంఘ నాయకుడు చందు

ర్డు అచ్యయ్యమ్మపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి స్థానిక టీడీపీ నాయకులు పూల మాల వేసి నివాళులర్పించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల్లో ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జాతి గర్వించదగ్గ మహనీయుడు ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. టీడీపీ నాయకుడు బి.రాజురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేరొక కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ సినీరంగానికి, తెలుగు ప్రజలకు ఎన్టీఆర్ అందించిన సేవలను కొనియాడారు. ఆర్పీపేట ఉన్నత పాఠశాల్లో హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాండ్రేగుల రాజేశ్వరరావు, కనకేశ్వరరావు, బి.అప్పలరాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. మురళీనగర్ బిర్లాజంక్షన్‌లోని ఎన్టీఆర్ స్మారక విగ్రహం వద్ద వార్డు అధ్యక్షులు ఎస్.వరప్రసాద్ అధ్వర్యంలో కేక్ కట్ చేసి అభిమానుల మధ్య కోలాహలంగా సంబరాలు నిర్వహించారు. 51వ వార్డు టీడీపీ కార్యాలయం వద్ద వార్డు అధ్యక్షులు సనపల. కీర్తి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. 49వవార్డులో జరిగిన కార్యక్రమంలో సీనియరు నాయకులు బలగ. లోలాచి హాజరయ్యారు. అక్కయ్యపాలెం ప్రాంతంలోని గ్రేటర్ 27, 42, 44, 46 వార్డులలో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించి పండ్లు, కేకులు పంపిణీ చేశారు. శ్రీనగర్, దొండపర్తి, మండావారి వీధి, రైల్వేన్యూకాలనీ తదితర ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో గారపాటి సత్యనారాయణ, భరణికాన రామారావు, పీఎల్ఎస్ఎన్ ప్రసాద్, గారపాటి వెంకటేశ్వరరావు, అప్పాజీ, కాళ్ళ శ్రీను అల్లూరి సత్యనారాయణరెడ్డి, పీవీ రమణారావు, పొలుమూరి గురునాథ్, తాతబాబు, కన్నం వెంకట రమణారావు దువ్వి కాశీప్రసాద్, జనపాల కృష్ణ, కుప్పిలి కుంతీదేవి, గట్టు సీత పాల్గొన్నారు. సీనియర్ కార్యకర్త ముప్పాళ్ళ శ్రీకృష్ణను సత్కరించారు.

ఆకట్టుకున్న ఎన్టీఆర్ ఫొటో ప్రదర్శన

విశాఖ పౌరగ్రంథాలయంలో నటరత్న సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో విజయనగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు పి.రాజేశ్వరరావు వేసిన ఎన్టీఆర్ వివిధ పెన్సిల్ చిత్రాలను ప్రదర్శించారు. సుమారు 150 చిత్రాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రముఖులు సన్‌మూర్తి, భయ్యా శ్రీనివాస్, పోర్టు సత్యం, భూపతి సందర్శించారు. తదుపరి విభావరిలో ఎన్టీఆర్ గీతాలను ఆలపించారు.



నిరాశ్రయులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న 41వవార్డు టీడీపీ నాయకులు



మురళీనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నేతలు



సీతంపేటలోని బీజేపీ కార్యాలయంలో ..



బి.రాజురెడ్డి ఆధ్వర్యంలో కంచరపాలెంలో.

రాకాసి అలలు!

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం, మాన్‌సూన్ కరెంట్ ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. తీరం దిశగా అలలు ఎగిసిపడుతూ వస్తున్నాయి. దీంతో బుధవారం సముద్రపు అలలు తీరంలోని రక్షణ గోడకు సమీపం వరకు వచ్చాయి. ఒక్కసారిగా ఆర్కే బీచ్‌లోని ఇసుకతిన్నెలను దాదాపుగా సముద్రం నీటితో కప్పేశాయి. అలల ధాటికి ఇసుక భారీగా కోతకు గురైంది. ఈ ప్రాంతంలో ఎక్కువగా సందర్శకులు నిత్యం తిరుగుతూ ఉంటారు. అలల ధాటికి భీతిల్లి సందర్శకులెవరూ బీచ్ రోడ్డు నుంచి లోపలకు రాలేదు. ఆర్కే బీచ్‌లో వ్యూ పాయింట్‌కు ఆనుకుని సముద్రంలో వ్యాపారం కోసం వేసుకున్న స్టాల్స్ వరకు అలలు రావడంతో దుకాణదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కాగా కురుసుర మ్యూజియం వద్ద సముద్రం భారీగా కోతకు గురైంది. గత ఏడాది డిసెంబరులో కురుసుర మ్యూజియానికి ఉత్తర వైపుగా భారీగా కోత ఏర్పడింది. ఈ ఏడాది రుతుపవనాలు ప్రవేశిస్తూనే కురుసుర వద్ద తీరం కోతకు గురికావడంతో సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడనాలు, మాన్‌సూన్ కరెంట్ ఉధృతంగా ఉన్నప్పుడు తీరం కోతకు గురవుతుందని, అందువల్ల కోత నివారణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని సముద్ర అధ్యయన నిపుణులు కోరుతున్నారు.

బెయిల్ నిరాకరణ

(3వ పేజీ తరువాయి)

అక్కడ గోడను నిర్మించారని, పునాదులు లేకపోవడం వల్ల అది కూలిపోయి ప్రమాదం జరిగిందని తేల్చారు. ఈ పనులను పర్యవేక్షిస్తున్న దేవస్థానం ఈఈ దండు గణపతి శ్రీనివాస రాజు, పర్యాటక శాఖ ఈఈ కలిమి రమణతో పాటు కాంట్రాక్టర్ కె.లక్ష్మీనారాయణ నిర్లక్ష్యం కూడా ఉందని నివేదికలో పేర్కొన్నారు. వారిపై క్రిమినల్ కేసులు పెట్టి విచారణ జరపాలని సూచించారు. ఈ మేరకు ప్రభుత్వం కేసులు నమోదు చేయాలని ఆదేశించడంతో దేవస్థానం పరిపాలనాధికారి గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో వారిపై భారత న్యాయ సంహిత సెక్షన్లు 105, 125ల కింద కేసులు పెట్టారు. ఈ ముగ్గురు అరెస్టు కాకుండా ఉండేందుకు ముందస్తు బెయిల్ కోసం జిల్లా న్యాయస్థానంలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే గోడ నిర్మాణంలో నిర్లక్ష్యం వహించారని, కేసు ఇంకా విచారణలో ఉందని, బెయిల్ ఇవ్వడం సరికాదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు వాదనలు వినిపించడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు వారి బెయిల్ పిటిషన్ తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. ఈ నేపథ్యంలో గోపాలపట్నం పోలీసులు నిందితులను అరెస్టు చేస్తారా? వారికి హైకోర్టుకు అప్పీల్ చేసుకునే అవకాశం కల్పిస్తారా? అనేది చూడాలి.

కాలుష్యం నుంచి విముక్తి

(3వ పేజీ తరువాయి)

బొండా జగన్ ఈ సమస్యను ఏఎంహెచ్‌ఓ కిరణ్ కుమార్, ఐలా కమిషనర్ విల్లి కిషోర్‌ల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఐలా కమిషనర్ కిషోర్ సుమారు రూ.7 లక్షలతో డంపింగ్ యార్డుగా మారిన స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. సెక్యూరిటీ గార్డును ఏర్పాటుచేశారు. ఇప్పటికే అక్కడ ఉన్న చెత్తను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. చెత్తను పూర్తిగా తరలించాక, సీసీ కెమెరాలను కూడా ఏర్పాటుచేయనున్నట్టు ఐలా కమిషనర్ అయినవిల్లి కిషోర్ తెలిపారు. తమ సమస్యకు పరిష్కారం చూపిన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికకు, ఐలా కమిషనర్‌కు, కార్పొరేటర్ బొండా జగన్‌కు తిరుమల నగర్ కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.

తగ్గిన ఉక్కు ఉత్పత్తి

(3వ పేజీ తరువాయి)

మొదలు కాకముందు రోజుకు 14 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేశారు. సమ్మె మొదలైన తరువాత అది 10-11 వేల టన్నులు మాత్రమే వస్తోంది. ప్రస్తుతం శాశ్వత ఉద్యోగులతో 12 గంటల డ్యూటీ చేయిస్తున్నారు. తీసేసిన కార్మికులు మాత్రమే బయట సమ్మె చేస్తున్నారు. మిగిలిన ఎనిమిది వేల మంది విధులకు హాజరవుతున్నారు. వారితో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల నుంచి పూర్తి ఉత్పత్తి (14 వేల టన్నులు) తీయడమే కష్టంగా ఉంటే...మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభిస్తే అక్కడ పనులు ఎవరు చేస్తారని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఎన్నాళ్లు శాశ్వత ఉద్యోగులతో 12 గంటల డ్యూటీ చేయిస్తారని నిలదీస్తున్నారు.

కార్మికులపై అసత్య ప్రచారం

స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఆరా తీస్తోంది. జిల్లా కలెక్టర్ మంగళవారం రాత్రి సీఎండీని, ఇతర ఉన్నతాధికారులను పిలిచి ప్లాంటులో పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్లాంటులో జరుగుతున్న ప్రమాదాల గురించి ప్రస్తావన రాగా కార్మికులే కావాలని ప్లాంటు పరికరాలకు నష్టం కలిగిస్తున్నారంటూ అధికారులు చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది. కడపలో మహానాడులో ఉన్న సీఎం చంద్రబాబును కలిసి ప్లాంటు పరిస్థితి వివరించేందుకు సీఎండీ, ఉన్నతాధికారులు అక్కడికి వెళ్లారు.

పోలీసులు అంతా అక్కడే

స్టీల్‌ప్లాంటు గేటు వద్ద కాంట్రాక్టు కార్మికుల ఆందోళన రోజురోజుకూ ఉధృతమవుతోంది. తమకు ఉపాధి పోయిందని, కుటుంబాలతో సహా ఆత్మహత్య చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు. పరిపాలనా భవనం లోపలకు వెళ్లడానికి యత్నిస్తున్నారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు భీమిలి, సిటీ పోలీసు అధికారులందరినీ స్టీల్ ప్లాంటుకే తరలించారు.

'ఉపాధి కల్పించకపోతే చంపేయండి'

(3వ పేజీ తరువాయి)

కోసం సర్వం త్యాగం చేశామని, భూములు, ఇళ్లు కోల్పోయామని, శాశ్వత ఉపాధి లేక కూలి పనులు చేస్తున్నామని, ఇప్పుడు అవి కూడా లేవంటున్నారని అక్కడకు వచ్చిన అధికారులు ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కల్పించకపోతే తమను చంపేయాలన్నారు. ఇదిలావుండగా ప్లాంటులో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

భవిష్యత్తు కార్యాచరణ ప్రకటన రేపు

గురు, శుక్రవారాల్లో కూర్మన్నపాలెం దీక్షా శిబిరం వద్ద భారీఎత్తున నిరసన కార్య క్రమాలు చేపడతామని కాంట్రాక్టు కార్మిక నాయకులు తెలిపారు. శుక్రవారం ఆర్ఎల్‌సీ (రీజనల్ లేబర్ కమిషనర్) సమక్షంలో చర్చలు జరగనున్నాయని, చర్చల అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

అడ్మిన్ ముట్టడిలో పాల్గొన్న నాయకులపై కేసు నమోదు

స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ భవనం ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళ, బుధవారాల్లో కాంట్రాక్టు కార్మికులు అడ్మిన్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. అడ్మిన్ భవనం ప్రవేశ, నిష్క్రమణ గేట్ల వద్ద చేపట్టిన ముట్టడి కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, కార్పొరేటర్ గంగారావు, నాయకులు సత్యనారాయణ, కేఎం శ్రీనివాస్, నమ్మి రమణ, జి.శ్రీనివాస్, ఆర్‌టీ రాజులతో పాటు సుమారు 200 మంది కార్మికులు పాల్గొని రాకపోకలు సాగించే ఉద్యోగులకు ఇబ్బందులు కలిగించారని పేర్కొంటూ ప్లాంట్ జీఎం లలన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనేక కార్పొరేట్ కార్యకలపాలు, అనేక విభాగాలు కలిగిన అడ్మిన్ భవనం వద్ద ఇటువంటి కార్యక్రమాలను చేపట్టడం వల్ల విధులకు అంతరాయం వాటిల్లుతుందని, భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలు చేయకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై పోలీసులు పైన పేర్కొన్న వారిపై కేసు నమోదు చేశారు.

నెత్తురోడుతున్న రోడ్లు

(3వ పేజీ తరువాయి)

ఈ నెల 23న ద్విచక్ర వాహనంపై వెళుతున్న వైద్య విద్యార్థిని కారు ఢీకొనడంతో మృతిచెందింది. ఈనెల 24న సంగివలస వద్ద రహదారి దాటుతున్న దీవీస్ ఉద్యోగిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది.

బ్లాక్‌స్పాట్లపై నిర్లక్ష్యం

ఈ ఏడాది మొదట్లో కాస్త తగ్గినట్టు కనిపించిన రోడ్డుప్రమాదాలు ఇటీవల మళ్లీ పెరుగుతున్నాయి. నగరంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న 68 ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో రాత్రి పూట లైటింగ్‌కు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలు, పొదలను తొలగించారు. బ్లాక్‌స్పాట్‌ల వద్ద లైటింగ్ పెంచారు. హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేయడంతో పాటు ఒక కానిస్టేబుల్‌ను రాత్రిపూట అక్కడ విధుల్లో ఉంచేవారు. దీని వల్ల ఈ ఏడాది మొదట్లో రోడ్డు ప్రమాదాలు తగ్గినట్టు కనిపించాయి. తర్వాత ట్రాఫిక్ పోలీసులు నిర్లక్ష్యం వహించడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2022లో 1,353 ప్రమాదాలు జరగ్గా 346 మంది మృతిచెందారు. 2023లో 1,180 రోడ్డు ప్రమాదాలు జరిగి 209 మంది మరణించారు. 2024లో రోడ్డు ప్రమాదాలు 1094కి తగ్గగా, మరణాల సంఖ్య మాత్రం 261కి పెరిగింది. ఈ ఏడాది మే 27 నాటికి నగరంలో దాదాపు 625 రోడ్డు ప్రమాదాలు జరిగినట్టు పోలీసులు చెబుతున్నారు. ఆయా ప్రమాదాల్లో 130 మంది మృతిచెందారు.

ట్రాఫిక్ పోలీసుల తీరుపై విమర్శలు

వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంతోపాటు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూడాల్సిన ట్రాఫిక్ పోలీసులు తమ బాధ్యతను విస్మరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కూడలి వద్ద ఒకరు, లేదా ఇద్దరు సిబ్బంది ఉండి ట్రాఫిక్ విధులను నిర్వర్తించాల్సింది పోయి, ఐదు నుంచి పది మంది వరకూ ఒకచోట గుమికూడుతున్నారు. ఆ మార్గంలో వచ్చిపోయే వాహనాలను అకస్మాత్తుగా ఆపుతున్నారు. ఆయా వాహనాలకు ఏమైనా పెండింగ్ చలాన్‌లు ఉన్నాయా? అని మొబైల్ యాప్‌లో తనిఖీ చేస్తున్నారు. పెండింగ్ చలాన్‌లు ఉంటే అక్కడికక్కడే కట్టిస్తున్నారు. పక్కనే ట్రాఫిక్ జామ్ అయిపోయినా సరే తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పోలీసుల ప్రధాన విధులను పక్కనపెట్టి, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారి కోసం ఎదురుచూస్తూ కనిపించగానే ఫొటోలు తీయడం, పెండింగ్ చలాన్‌లు కట్టించడంలోనే నిమగ్నమై పోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

యువకుడి ఆత్మహత్య

గోపాలపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలకు బానిసైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన విశాఖ గ్రేటర్ పరిధి 89వ వార్డు సంతోష్‌నగర్‌లో చోటుచేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు సమీపంలోని గూనాం గ్రామానికి చెందిన లద్దపుట్టి శ్యామ్(20), లద్దపుట్టి రాజా (24) అనే సోదరులు స్థానిక కొత్తపాలెంలోని సంతోష్‌నగర్‌లో అద్దె ఇంటిలో నివసిస్తున్నారు. వీరు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. రాజా బుధవారం మధ్యాహ్నం భోజనం చేశాక ఆటో నడిపేందుకు బయటకు వెళ్లాడు. శ్యామ్‌కు కాస్త అనారోగ్యంగా ఉందని ఇంటి వద్దే ఉండిపోయాడు. అయితే సాయంత్రం 5 గంటల సమయంలో రాజా అతని సోదరుడు శ్యామ్‌కు ఫోన్ చేసినా స్పందించలేదు. రాత్రి 8 గంటల సమయంలో రాజా ఇంటికి వచ్చాడు. తలుపు కొట్టినా లోపల ఉన్న శ్యామ్ తెరవకపోవడంతో సమీపంలో ఉన్న ఇంటి యజమాని సాయంతో తలుపులు తెరిచి చూడగా నైలాన్ తాడుతో శ్యామ్ ఉరేసుకుని కనిపించాడు. రాజా ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ అప్పలనాయుడు మృతదేహాన్ని పరిశీలించి, ఘటనపై ఆరాతీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు శ్యామ్‌కు మత్తు పదార్థాలు సేవించే అలవాటు ఉందని, ఈ కారణంతోనే మృతి చెంది ఉంటాడని రాజా పోలీసులకు తెలిపినట్లు తెలిసింది.



శ్యామ్ (ఫైల్ ఫొటో)

ఆటోలో మరిచిన నగదు సంచి అప్పగింత



బాధితుడికి నగదు అప్పగిస్తున్న పోలీసులు

కంచరపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆటోలో మరిచిపోయిన నగదు సంచిని కొద్ది సేపటిలో గుర్తించి బాధితునికి కంచరపాలెం క్రైం పోలీసులు అప్పగించారు. మర్రిపాలెం ప్రాంతానికి చెందిన రాజారావు తన కుమారుడి ఆపరేషన్ కోసం రూ.1.20 లక్షల నగదును సంచిలో పెట్టుకుని బుధవారం సాయంత్రం హైదరాబాద్ వెళ్లేందుకు ఆటోలో బయలు దేరాడు. రైల్వేస్టేషన్ దగ్గర ఆటోలో ఆ సంచిని మరిచిపోయి రైలు ఎక్కబోయాడు. సంచి ఆటోలో మరిచిపోయినట్లు గుర్తించిన రాజారావు వెంటనే 112 నెంబరుకు ఫోన్ చేసి కంచరపాలెం క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు నేతృత్వంలో ఎస్సై సూర్యనారాయణ రంగంలోకి దిగి విచారణ జరిపారు. ఆటోను గుర్తించి అందులో నగదును స్వాధీనం చేసుకుని బాధితుడు రాజారావుకు ఎస్సై సూర్యనారాయణ, బ్లూకోర్టు కానిస్టేబుల్ రాంబాబు, కానిస్టేబుల్ తులసి అప్పగించారు. బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

వైద్య సిబ్బందికి ముఖ హాజరు తప్పనిసరి



నరసింహనగర్ ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

అక్కయ్యపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి): నరసింహనగర్-1 పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం సందర్శించారు. అభ ఐడీ నమోదు, ఎన్‌సీడీసీడీ సర్వే, ఈహెచ్‌ఆర్ శతశాతం సాధించాలని ఆదేశించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సమీక్షలో ముఖ్యంగా ఓపీ, ఐపీ, ల్యాబ్ టెస్టులు, సాధారణ ప్రసవాలు, ఆర్‌సీహెచ్ రిజిస్ట్రేషన్లు, కేపీఐ ఇండికేటర్స్ కోసం వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. వైద్యాధికారులు, సిబ్బంది విధిగా ముఖ హాజరు వేయాలని, ఆసుపత్రిలో సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాలన్నారు. ఆశా కార్యకర్తలు వారి విధులను నిర్వర్తించే ప్రాంతాల్లో ఏఎన్‌ఎంలతో కలిసి గర్భిణులకు టీటీ వ్యాక్సిన్, ఐరన్ ఫోలిక్ మాత్రలు అందిస్తూ ఎనీమియా బారిన పడకుండా చూడాలని తెలిపారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ, డాక్టర్ బి.ఉమావతి, డీపీఎంఓ, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు పాల్గొన్నారు.

మురళీనగర్ ప్రశాంతి పార్కు కొత్త కార్యవర్గం



ఎన్నికైన కొత్త కమిటీ సభ్యులు వీరే

మాధవధార, మే 28 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ సెక్టార్ 3 లోని ప్రశాంతి స్పిరిట్యువల్ పార్కు నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం జరిగింది. 'ప్రశాంతి పార్కు మెంబర్స్ అసోసియేషన్' పేరిట ఈ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పార్కులో స్వామి వివేకానంద స్మారక విగ్రహం వద్ద ఎన్నికైన కొత్త సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షునిగా జి.వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా రొంగలి జగన్నాథం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఉప్పలపాటి శుభ, ఆర్.భాస్కరరావు, కార్యదర్శిగా వి.రఘురామ్, జాయింట్ సెక్రటరీలుగా ముగ్గురు, ట్రెజరర్ ఒకరు, జాయింట్ ట్రెజరర్‌లుగా ముగ్గురు ఎన్నికయ్యారు. వీరితో పాటు నలుగురు కమిటీ మెంబర్లు, 9 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు నియమితులయ్యారు.

యోగా పోటీలకు ఆహ్వానం

డాబాగార్డెన్స్, మే 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఔత్సాహికులు పాల్గొనవచ్చునని, సచివాలయ పరిధిలో ఏదైనా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆధార్ కార్డుతో హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, సమగ్రశిక్ష అదనపు పథక సమన్వయకర్త జె.చంద్రశేఖర్‌లు కోరారు. యోగాసన పోటీలు ఈ నెల 30 వరకు గ్రామ, వార్డుస్థాయిలో మూడు కేటగిరీల్లో జరుగుతాయన్నారు. వ్యక్తిగత విభాగంలో ఆసనాల ప్రదర్శన, సూర్య నమస్కారాల ఛాలెంజ్, ప్రాణాయామ ప్రదర్శన, ధ్యాన ఏకాగ్రత తదితర వాటిల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రతిభను ప్రదర్శించవచ్చునన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మాధవధార, మే 28 (ఆంధ్రజ్యోతి); ఈపీడీసీఎల్ ఎన్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధి విద్యుత్ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 30న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్-2 డీఈ బి.కె.నాయుడు తెలిపారు. మాధవధార, ఎన్ఏడీ కాకాని నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాధవధార, కళింగనగర్, ఎన్ఏడీ కాకానినగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

'దళితులపై దాడులకు పాల్పడినవారిని శిక్షించాలి'

సీతమ్మధార, మే 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగిపోయాయని, ఇటీవల తెనాలిలో ఇద్దరు దళితులు, ఒక ముస్లింను నడిరోడ్డుపై పోలీసులు జరిపిన దమనకాండ అమానుషం, చట్ట విరుద్ధమని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణ్‌రావు విమర్శించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు జేవీ ప్రభాకర్, కె.హరిబాబు, బొడ్డు రాజు, గుడాల రాంబాబులతో కలిసి ఆయన మాట్లాడారు. దాడులకు పాల్పడిన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన మంత్రి నాదెండ్ల మనోహర్ నియోజకవర్గంలో జరిగిందని, సంఘటనకు బాధ్యులుగా సీఐ రాములు నాయక్, ఎస్సై రమేష్ బాబులను అరెస్ట్ చేయాలన్నారు. పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ

(3వ పేజీ తరువాయి)

తమ పేర్లు తీసి కొత్తగా కార్డు ఇవ్వాలంటూ 1,684 మంది, కార్డు నుంచి సభ్యుల పేర్లను తొలగించాలంటూ 1,222 మంది, చిరునామా మార్పు కోసం 948 మంది, ఆధార్ నంబర్‌తో బియ్యం కార్డుకు అనుసంధానంలో తప్పుల సవరణకు 508 మంది, రేషన్ దుకాణాల రెన్యువల్‌కు 45 మంది, కార్డు సరండర్ చేస్తామని ఐదుగురు దరఖాస్తు చేశారు. దరఖాస్తుల స్వీకరణకు ఇంకా గడువు ఉన్నందున భారీగా వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

అనాథాశ్రమంలో వృద్ధులకు బియ్యం కార్డు: జేసీ మయూర్ అశోక్

బియ్యం కార్డులో మార్పులు, చేర్పులకు సంబంధించి జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పలు సూచనలు చేస్తూ ప్రకటన విడుదల చేశారు. అనాథాశ్రమంలో ఉండే వృద్ధులు కొత్తగా బియ్యం కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అదేవిధంగా కొత్త కార్డుకు ఈకేవైసీ పూర్తి చేసుకున్నవారు మరోసారి దరఖాస్తు చేయనవసరం లేదని పేర్కొన్నారు. వచ్చేనెలలో క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్‌కార్డులు లబ్ధిదారుల ఇళ్లకు పంపడం జరుగుతుందన్నారు. వివాహమైనా, ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లు కార్డు నుంచి తొలగించే ఆప్షన్ అందుబాటులోకి వచ్చిందన్నారు. 15 ఏళ్లు దాటిన పిల్లలను కార్డులో చేర్చవచ్చునని, ప్రభుత్వ పింఛన్ తీసుకుంటే కార్డుకు అర్హులు కారని, కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ/ప్రైవేటు ఉద్యోగం చేస్తూ నెలకు నగరంలో రూ.12 వేలు, గ్రామీణ ప్రాంతంలో రూ.10 వేలు జీతం వస్తే కుటుంబం మొత్తం కార్డు పొందేందుకు అర్హులుకారని ఆయన పేర్కొన్నారు. అలాగే నాలుగు చక్రాల వాహనం కలిగివుండడం, మూడెకరాల పల్లపు భూమి, మొత్తం 10 ఎకరాల భూమి కలిగివుంటే ఆ కార్డుదారుని అనర్హులుగా పరిగణించడం జరుగుతుందన్నారు.

డబుల్ డెక్కర్ బస్సులు వస్తున్నాయ్..

(3వ పేజీ తరువాయి)

సీఎస్సార్ నిధులతో కొనుగోలు చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ నిర్ణయించారు. ఈ రెండు బస్సుల కొనుగోలుకు స్మార్ట్ సిటీ కార్పొరేషన్ పిలిచిన టెండర్లను ఈ నెల 31న తెరవనున్నారు. టెండర్లు ఖరారయ్యాక వచ్చేనెలలో కొత్త బస్సులను కొనుగోలు చేసి బీచ్ రోడ్డులో ప్రజలు, పర్యాటకులకు అందుబాటులోకి తేనున్నారు. ఈ బస్సులకు ఆదరణ ఉండేలా ప్రత్యేకంగా టిక్కెట్లను విక్రయించాలని అధికారులు నిర్ణయించారు. టిక్కెట్ కొనుగోలు చేస్తే రోజంతా ఆ టికెట్‌ను మూడు బస్సుల్లో వినియోగించుకునే అవకాశం కల్పిస్తారు. టికెట్ కొనుగోలు చేసిన వ్యక్తి డబుల్ డెక్కర్ బస్సుల్లో ఏదో ఒక బస్సు ఎక్కి, బీచ్ రోడ్డులో తనకు కావాల్సిన చోట దిగడంతో పాటు అక్కడ గడిపిన తరువాత అక్కడి నుంచి మరో బస్సులో ఎక్కి వేరే చోటకు వెళ్లడానికి అవకాశం కల్పిస్తారు. మూడు డబుల్ డెక్కర్ బస్సులూ బీచ్ రోడ్డులో నిరంతరం రాకపోకలు సాగిస్తుంటాయి.



గాజువాక : ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న తెలుగు యువత అధ్యక్షుడు బలగ బాలునాయుడు



పెదగంట్యాడ : ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి తదితరులు



కూర్మన్నపాలెం : వడ్లపూడిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్

- పలు చోట్ల జయంతి ఉత్సవాలు
- ఘనంగా నివాళులు అర్పించిన టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు
- పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు

దేశ యువతకు ఆదర్శనీయుడు ఎన్టీఆర్

గాజువాక, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతి సందర్భంగా బుధవారం గాజువాకలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ గాజువాక తెలుగు యువత అధ్యక్షుడు బలగ బాలునాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ యుగ పురుషుడని, తెలుగు నేలపై ఇలాంటి మహోన్నత వ్యక్తి పుట్టడం తెలుగుజాతికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, బాబా, అజయ్‌కుమార్, నర్సింగరావు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

పెదగంట్యాడలో..

పెదగంట్యాడ, మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి వేడుకలను బుధవారం పెదగంట్యాడలో ఘనంగా నిర్వహించారు. పెదగంట్యాడ టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకలో వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దాడ సోమునాయుడు, లీగల్ సెల్ మీడియా కో-ఆర్డినేటర్ బసా అప్పలరెడ్డి, మొల్లి రమణ (అక్తర్), మహిళా నాయకులు సరోజని, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం ఎన్టీఆర్ జంక్షన్‌లో జరిగిన ఎన్టీఆర్ జయంతి ఉత్సవాల్లో టీడీపీ 75వ వార్డు ప్రధానకార్యదర్శి ములకలపల్లి పెంటయ్య పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

హెచ్‌బీ కాలనీల్లో జరిగిన ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో టీడీపీ 76వ వార్డు కమిటీ నాయకులు పీత రమణ, జిత్తుక రాజు, వియ్యపు వెంకన్న, వెల్లంకి శివరాంప్రసాద్ పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కర్ణంవానిపాలెంలో పారిశ్రామిక ప్రాంత గీత సహకులాల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు నెలి సాధూరావు పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కోర్టు న్యాయవాది సూర్యనారాయణ, టీడీపీ నాయకులు సోమునాయుడు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడిలో..

అగనంపూడి, మే 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు 102 జయంతి వేడుకలను అగనంపూడిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మినీ జగదాంబ జంక్షన్ పైలాన్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెదమడకలో ఎన్టీఆర్ విగ్రహానికి 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాత అగనంపూడిలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 79వ వార్డు తెలుగు మహిళా అధ్యక్షురాలు గల్ల హనిత, స్థానిక నాయకులు కరణం సత్యారావు, రుద్రకుమార్, డొక్కా రమేశ్, బంధం అప్పలరాజు, మొల్లి కోటి, వంకర రాము, గల్లా సూర్యనారాయణ, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కూర్మన్నపాలెంలో..



అగనంపూడి : పైలాన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న దశేంద్ర

కూర్మన్నపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 86 వార్డు కూర్మన్నపాలెంలో ఎన్టీఆర్ అభిమానులు, ఫార్మా ఉద్యోగులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నల్ల రామారావు, సత్యనారాయణ, లోకేష్, అప్పారావు, వీరభద్రరావు, వేంకటేశ్, ఉదయ్‌శంకర్, నాయుడు, చంద్ర పాల్గొన్నారు. జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలో ఎన్టీఆర్ పార్కులో బుధవారం టీడీపీ అభిమానులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రగడ దానయ్య, ఆనంద్ కుమార్, భాగ్యలక్ష్మి, కడుపుట్ల శ్రీను, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. డ్రైవర్సు కాలనీలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ 70 వార్డు కార్యదర్శి కేవీఎస్ శంకరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెహ్మాన్, గోవింద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 88వ వార్డు యాదవ జగ్గరాజుపేటలో సీనియర్ టీడీపీ నాయకులు గొలగాని సన్యాసిరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రమణ, గంగరాజు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 69 వార్డు తుంగ్లాం కాలనీలో నిర్వహించిన ఎన్టీఆర్ జయంతి కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నావన సింహచలం, కాకి రామిరెడ్డి,పెట్లి అర్జున్, వి.వరహాలు, పీవీ రాజు తదితరులు పాల్గొన్నారు... భెల్ హెచ్‌పీవీపీ మెయిన్‌గేటు వద్ద జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ సీనియర్ నాయకులు అక్కిరెడ్డి శ్రీను పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్. సాహు, వీవీఎన్ రాజు, బి.బాబూరావు, జీటీపీ ప్రకాశ్, కె.ముత్యాలనాయుడు, కొల్లి దేముడు తదితరులు పాల్గొన్నారు. హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో జరిగిన జయంతి వేడుకల్లో కూటమి నాయకులు కరణం ముత్యాలనాయుడు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి కేకు కట్ చేశారు. శీరం రాజేశ్, జి.రామాంజనేయులు, ఎల్. శ్రీధర్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

సినీ థియేటర్లలో ఆర్డీవో తనిఖీలు



గాజువాక శ్రీకన్య థియేటర్ వద్ద వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో శ్రీలేఖ

గాజువాక, మే 28 (ఆంధ్రజ్యోతి) : గాజువాక మండలంలోని పలు సినిమా థియేటర్లలో ఆర్డీవో శ్రీలేఖ తనిఖీలు నిర్వహించారు. గాజువాక సినిమాహాల్ జంక్షన్‌లో గల పలు థియేటర్‌లను పరిశీలించారు. తినుబండారాల ధరలపై ఆరా తీశారు. ఆహార భద్రతకు తీసుకుంటున్న చర్యల గురించి వాకబు చేశారు. అలాగే పెదగంట్యాడలోని ఓ థియేటర్‌లో కూడా తనిఖీలు చేపట్టారు. ఆర్డీవో వెంట గా జువాక, పెదగంట్యాడ తహసీల్దార్లు శ్రీవల్లి, అమల, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మహానాడులో టీడీపీ పారిశ్రామిక ప్రాంత నేతలు



కడప మహానాడులో టీడీపీ నేత నల్లారి సూర్యనారాయణ తదితరులు

కూర్మన్నపాలెం,మే 28 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రాంత తెలుగుదేశం పార్టీ నాయకులు కడపలో నిర్వహిస్తున్న మహానాడులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, నల్లారు సూర్య నారాయణలు, నేతలు రాజన్‌రాజు, వేగుంట శ్రీనివాస్, మానా పురం గణపతి,కాండ్రేకుల శ్రీనివాస్,'సుబ్బయ్యపోతల కృష్ణ, నాగార్జున, వేంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటరమణ



అక్కిరెడ్డిపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్)విశాఖ జిల్లా అధ్యక్షులుగా పెట్లి వెంకటరమణ ను నియమించినట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు ఒక ప్రకటనలో తెలిపారు. మాదిగ హక్కుల పరిరక్షణతో పాటు జిల్లాలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అభివృద్ధికి తాను పూర్తి కృషి చేయనున్నట్టు రమణ తెలిపారు.

చింతలలోవలో దోమల నివారణకు ఫాగింగ్



సింధియా, మే 28, (ఆంధ్రజ్యోతి) : కొండవాలు ప్రాంతంలో దోమల నియంత్రణకు ఫాగింగ్‌ను జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది ముమ్మరం చేశారు. జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతలలోవ కొండవాలు ప్రాంతాలు, దోమలు ఎక్కువ వున్న ప్రాంతాల్లో బుదవారం ఫాగింగ్ ప్రక్రియ నిర్వహించారు.

నేడు బంగారమ్మ తల్లి పండుగ



విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా ముస్తాబైన బంగారమ్మ తల్లి ఆలయం

అక్కిరెడ్డిపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : నాతయ్యపాలెం, షీలానగర్ పరిసర కాలనీల ఆరాధ్య దేవత బంగారమ్మతల్లి పండుగ అనుపు మహోత్సవం గురువారం నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో కాలనీలోని బంగారమ్మ ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ప్రత్యేక పూలు, నగలతో అమ్మవారిని వేదపండితులు అలంకరించారు. గురువారం ఆలయం వద్ద ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులపై నిర్లక్ష్యం తగదు : సీపీఐ



మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణ

ఉక్కుటౌన్‌షిప్, మే 28 (ఆంధ్రజ్యోతి) : స్టీల్ ప్లాంటు కాంట్రాక్టు కార్మికులపై దాడులు సరికాదని, కార్మికులపై యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి విడనాడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ అన్నారు. ప్లాంటు టీటీఐ జంక్షన్ వద్ద బుధవారం నిరవధిక సమ్మె చేస్తున్న కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం శాశ్వత ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికులు పోరాడారని, అదే విధంగా ఉత్పత్తి విషయంలో కూడా ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. అంతేకాకుండా ప్లాంటు కోసం భూములు ఇచ్చిన వారు.. నేడు ఇదే ప్లాంట్‌లో ఉపాధి కోసం పోరాడుతుంటే బాధ కలుగుతోందన్నారు. ప్లాంటులో ఏ ఒక్కరినీ తొలగించరాదని, తాము కార్మికుల పక్షాన నిలుస్తామన్నారు.కార్యక్రమంలో సీపీఐ నాయకులు, ఉక్కు కాంట్రాక్టు కార్మిక సంఘ నేతలు పాల్గొన్నారు.

విశాఖ సెంట్రల్ జైలుకు తిరిగి వచ్చిన
ఉగ్రవాద సానుభూతిపరులు

ఆరిలోవ, మే 28(ఆంధ్రజ్యోతి): విజయనగరంలో పేలుళ్లకు కుట్ర చేసి పోలీసులకు పట్టుబడిన ఉగ్రవాద సానుభూతిపరులు సిరాజ్, సమీర్‌లు పోలీస్ కస్టడీ ముగించుకొని తిరిగి బుధవారం విశాఖపట్నం సెంట్రల్ జైలుకు వచ్చారు. ఈ కేసులో వారిని విచారించి, అదనపు సమాచారం రాబట్టేందుకు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నవారిని వారం పాటు తమ కస్టడీకి ఇవ్వాలని విజయనగరం పోలీసులు కోరడంతో కోర్టు అనుమతించిన సంగతి తెలిసిందే. ఆ మేరకు వారిని ఇక్కడి నుంచి తీసుకెళ్లి అన్ని వివరాలు రాబట్టిన పోలీసులు కస్టడీ గడువు ముగియడంతో తిరిగి విశాఖ సెంట్రల్ జైలుకు అప్పగించారు. విచారణలో అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పినట్టు సమాచారం ఉందని జైలు సూపరింటెండెంట్ మహేష్ బాబు తెలిపారు.



కడపలో నిర్వహిస్తున్న మహానాడులో టీడీపీ సభ్యత్వాన్ని రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



పద్మనాభనగర్‌లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న కార్యకర్తలు



బుచ్చిరాజుపాలెంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ తదితరులు

ఎన్టీఆర్‌కు టీడీపీ కార్యకర్తల ఘన నివాళి

పెందుర్తి/పెందుర్తి రూరల్/వేపగుంట/ఎన్ఏడీ జంక్షన్/ గోపాలపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి సందర్భంగా బుధవారం పలుచోట్ల ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకలలో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. తెలుగు జాతికి ఎన్టీఆర్ చేసిన సేవలను కొనియాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు కరక దేవుడు, నేత పీలా జితేంద్ర, శరగడం బుజ్జి నూకరాజు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గుండాల అప్పలరాజు హాజరై ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈవోఆర్డీ శ్రీరామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు. చింతల అగ్రహారం బస్ స్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్పంచి దాడి గోపి అప్పలనాయుడు, మాజీ సర్పంచులు ఆళ్ల తాతారావు, పి.అప్పారావు, మద్దాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. పొర్లుపాలెంలో మాజీ ఉపసర్పంచి గల్లా వెంకటరమణ, చీమలాపల్లిలో అయితా ఎర్నిబాబు, పురుషోత్తపురంలో మాజీ సర్పంచి పిల్లల అప్పలనాయుడు తదితరులు నివాళులర్పించారు. నాయుడుతోట జంక్షన్‌లో టీడీపీ సీనియర్ నాయకుడు బాలాజీ రాము ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ రాపర్తికన్నా నిరుపేదలకు పులిహోర, పొంగలి అందజేశారు. నాయకులు యశశ్వి, దివాకర్, దేముడు, జట్లయ్య పాల్గొన్నారు. బుచ్చిరాజుపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు, తెలుగు ప్రజలకు ఎన్టీఆర్ చేసిన సేవలను వివరించారు. తెదేపా వార్డు అధ్యక్షుడు శరగడం అరుణ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు, పైడిరాజు, మహాలక్ష్మీనాయుడు, జగన్ తదితరులు పాల్గొన్నారు. గోపాలపట్నంలో పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో, 92వ వార్డు పద్మనాభనగర్, 88వ వార్డు నరవ, సత్తివానిపాలెం గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంత నేతలు, కార్యకర్తలు అన్న ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. మహిళలను అన్నిరంగాల్లో ముందుకు నడిపించిన ఘనత ఎన్టీఆర్‌దేనని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.

గోపాలపట్నం: కడప జిల్లాలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి పశ్చిమ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబుతో పాటు నియోజకవర్గ టీడీపీ కార్పొరేటర్లు, వార్డు కమిటీ సభ్యులు, మహిళా కమిటీ, అనుబంధ సంఘాల సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహానాడు వేడుకలో గణబాబు తన సభ్యత్వ కార్డును రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, క్రియాశీల కార్యకర్తలు ఉన్నారు.



పెందుర్తిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



నాయుడుతోటలో పేదలకు పులిహోర పొట్లాలు అందజేస్తున్న కార్పొరేటర్ రాపర్తికన్నా, బాలాజీ రాము తదితరులు

సినిమా గైడ్

- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం)
- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **నిశ్శబ్దప్రేమ** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం),
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: రమాదేవి, సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 16, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 18, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 32, బీరకాయలు 36, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 38 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది)54, బరబాటి 30, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 30, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

'జనసేన సభ్యత్వాల్లో ద్వితీయ స్థానంలో పెందుర్తి'



వీరమహిళకు గుర్తింపు కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెర్రిపోతులపాలెంలో బుధవారం జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్తలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు హాజరయ్యారు. జనసేన సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో రెండో స్థానంగా పెందుర్తి నియోజకవర్గం నిలిచిందంటే కార్యకర్తల కృషి ప్రధాన కారణమని అన్నారు. జనసేన సభ్యత్వంతో రూ.5 లక్షల బీమా సౌకర్యం లభిస్తుందన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారి వైద్య సహాయానికి ఎమ్మెల్యే రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జనసేన నేత మడక బంగార్రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గల్లా శ్రీను, ఇందల రమణ, నందవరపు సన్యాసిరావు పాల్గొన్నారు.

గాయత్రిదేవికి వార్షికోత్సవ పూజలు



నాయుడుతోటలో వేదమాత గాయత్రిదేవికి అభిషేకం

వేపగుంట, మే 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట జంక్షన్‌లో ఉన్న వేదమాత గాయత్రిదేవి తృతీయ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మేలుకొలుపు, నిత్యార్చన, దీక్షాధారణ అనంతరం అష్టోత్తర శత కలశ పూజ, లక్ష్మీగణపతి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూల మంత్రాల హోమం తదితర పూజలు నిర్వహించారు. గురువారం విశేష పూజల అనంతరం మహా అన్నసంతర్పణ నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పెందుర్తి పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పెందుర్తి, మే 28 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి 33-11 కెవీ సబ్‌స్టేషన్ ఫీడర్ విద్యుత్ మరమ్మతులు శుక్రవారం చేపడతామని జోన్ 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఇందువల్ల పెందుర్తి మెయిన్ రోడ్డు, పెందుర్తి జంక్షన్, అనకాపల్లి రోడ్డు, ఆనందపురం రోడ్డు, ఎల్ఐసీ కాలనీ, పాత పెందుర్తి ఊరు, దొగ్గవానిపాలెం, బ్యాంకు కాలనీ, సాయి నిరంజన్ కాలనీ, అఖిలేశ్వరి ఆస్పత్రి, వెట ర్నరీ ఆస్పత్రి వెనుక వైపు, బృందావన్ కాలనీ, దొగ్గవానిపాలెం పారిశ్రామిక ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సుజాతనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ..,

సుజాతనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. సుజాతనగర్ మెయిన్ రోడ్డు, ఎ.జోన్, గోపాలకృష్ణనగర్, పాపయ్యరాజుపాలెం బంక్‌రోడ్డు గణేశ్‌నగర్, శారదానగర్, అంబేడ్కర్ నగర్, వెంకటేశ్వర టెంపుల్ ఏరియా, బీ జోన్ అశ్విన్ నగర్, హెచ్‌పీ గ్యాస్ గోదాం ఏరియా, సత్యనారాయణపురం, వాంబే కాలనీ, శాంతినగర్, వీరానగర్ లేఅవుట్, కార్మిక నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు



గోపాలపట్నంలో ఓ థియేటర్‌లో తనిఖీ చేస్తున్న ఆర్డీవో పి.శ్రీలేఖ తదితరులు

గోపాలపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గోపాలపట్నం మండల పరిధిలోని సినిమా థియేటర్‌లలో రెవెన్యూ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. థియేటర్ల నిర్వహణ తీరు, లోపల సౌకర్యాలను పరిశీలించారు. ఆహార నాణ్యత, టికెట్ ధరలు, తినుబండారాల విక్రయం, థియేటర్ ఫిట్‌నెస్, అగ్ని, ఆహార, పారిశుధ్య పరిరక్షణ తదితర అంశాలను పరిశీలించారు. మండల పరిధిలోని థియేటర్‌ల నిర్వహణపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీల్లో ఆర్డీవో పి.శ్రీలేఖ, గోపాలపట్నం తహసీల్దార్ సీహెచ్‌వీ రమేశ్, ఆర్ఐ కోమలి, వీఆర్వో సమీర్ పాల్గొన్నారు.

వర్షానికి నేలకొరిగిన చెట్టు



శ్రీరామ్‌నగర్ ప్రధాన రహదారిలో రోడ్డుపై పడిన చెట్టు

గోపాలపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): ముసురు ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు చిత్తడిగా మారడంతో పాటు మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. స్థానిక శ్రీరామ్‌నగర్ ప్రధాన రహదారిలో ఓ చెట్టు నేలకొరిగింది. రాత్రి వేళ కావడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా బుధవారం ఉదయం జీవీఎంసీ సిబ్బంది రహదారిపై పడిన చెట్టును తొలగించారు.


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు


వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం


మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..





పసుపు జాతర

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.




మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు








నోరూరించే వంటలు రెడీ...


మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ


అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు


మేము విజిలేస్తే...


కార్యకర్తల ఉత్సాహం..


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు


పోలీసు తనిఖీలు

కేకే లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్‌రైలు


పట్టాలు తప్పిన రైలు చక్రాలు

అనంతగిరి, మే 28 (ఆంధ్ర జ్యోతి):కొత్తవలస-కిరండూల్ (కేకే) లైన్‌లో అనంతగిరి మండలం తైడ-చిమిడిపల్లి స్టేషన్ల మధ్య బుధవారం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ట్రాక్‌పై 53/34 కిలోమీటర్ వద్ద మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బండరాళ్లు జారిపడ్డాయి. అదే సమయంలో కిరండూల్ నుంచి ఐరన్ ఓర్‌తో విశాఖ వస్తున్న గూడ్స్ రైలు వాటిని ఢీకొని పట్టాలు తప్పినట్టు చెబుతున్నారు. గూడ్స్ పట్టాలు తప్పడంతో కేకే లైన్‌లో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు.

ప్రమాద స్థలిని సందర్శించిన డీఆర్‌ఎం

పట్టాలు తప్పిన గూడ్స్ రైలును డీఆర్‌ఎం లలిత్ బొహ్రా బుధవారం సాయంత్రం పరిశీలించారు. తైడా సమీపాన గూడ్స్ రైలు సుమారుగా 30 చక్రాలు పట్టాలు తప్పాయి. పట్టాలు సరిచేసి రైళ్ల రాకపోకలు పునరుద్ధరించడానికి రెండు రోజులు పడుతుందని అధికారులు పేర్కొన్నారు.

కేకే లైన్‌లో రైళ్లు రద్దు

కేకే లైన్‌లో కిలోమీటరు 53/54 వద్ద బండ రాళ్లు పడి రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో 18516 నంబరు కిరండోల్ - విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్ రైలును బుధవారం కొరాపుట్, రాయగడ మీదుగా విజయనగరం మళ్లించినట్టు రైల్వే వర్గాలు తెలిపాయి. అలాగే 58501 విశాఖ - కిరండోల్ పాసింజర్ రైలు 29వ తేదీన, తిరుగు ప్రయాణంలో 58502 కిరండోల్ - విశాఖ రైలు రద్దు చేశారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేశామని సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. విశాఖ-చర్లపల్లి-విశాఖ ప్రత్యేక రైళ్లకు (08579/08580) జూన్ 6 నుంచి 27 వరకు, విశాఖ-తిరుపతి-విశాఖ ప్రత్యేక రైళ్లకు (08547/08548) జూన్ 4 నుంచి 26 వరకు, విశాఖ-బెంగళూరు-విశాఖ ప్రత్యేక రైళ్లకు (08581/08582) జూన్ 1 నుంచి 30 వరకు ఒక్కొక్క థర్డ్ ఏసీ కోచ్‌లు జత చేస్తున్నామని తెలిపారు. విశాఖ-కిరండూల్ - విశాఖ రైళ్లకు (58501/58502) జూన్ 1 నుంచి జులై 1 వరకు, విశాఖ-గుణుపూర్-విశాఖ రైళ్లకు (58506/58505) జూన్ 1 నుంచి 30 వరకు ఒక్కొక్క స్లీపర్ క్లాస్ కోచ్‌లు జత చేస్తామన్నారు.సంబల్‌పూర్-ఈ రోడ్-సంబల్‌పూర్ ప్రత్యేక రైళ్లకు (08311/08312) జూన్ 4 నుంచి 27 వరకు, సంబల్‌పూర్ - నాందేడు-సంబల్ పూర్ రైళ్లకు (20809/20810) జూన్ 2 నుంచి జులై 1 వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లు జత చేయనున్నట్లు సందీప్‌కుమార్ తెలిపారు.

స్ఫూర్తి ప్రదాత ఎన్టీఆర్

» జయంతి కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్


ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు

మహారాణిపేట, మే 28 (ఆంధ్రజ్యోతి):
అత్యంత క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకుని, రాష్ట్ర ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన స్ఫూర్తి ప్రదాత దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ కొనియాడారు. ఎన్టీఆర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ సమావేశ మందిరంలో అట్టహాసంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ పాఠశాలల చిన్నారులు గీతాలాపనలు చేయడంతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. వారికి కలెక్టర్ స్వీట్లు, చాక్లెట్లు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో నటించి ప్రజల ఆరాధ్య దైవంగా ఎన్టీఆర్ నిలిచిపోయారని, ముఖ్యమంతిగా కిలో రెండు రూపాయలకే బియ్యం, సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని విధించి పరిపాలనలో తనదైన ముద్ర వేశారని గుర్తుచేశారు. 33 ఏళ్ల సినీ జీవితం, 13 ఏళ్ల రాజకీయ జీవితంలో మహోన్నతమైన వ్యక్తిగా ప్రజలందరి హృదయాల్లో ఎన్టీఆర్ చిరస్మరణీయులుగా నిలిచిపోతారన్నారు. ఆయన వ్యక్తి కాదు.. శక్తి, స్ఫూర్తి అని, అలాంటి ఉన్నత నేత ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఉప కలెక్టర్ మధుసూదనరావు, శేష శైలజ, పలువురు జోనల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగరతీరంలో..

బీచ్‌రోడ్డు: ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని సాగర తీరంలోని ఆయన విగ్రహానికి, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎన్టీ రామారావు ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఎనలేని సేవలందించిన గొప్ప వ్యక్తి ఎన్టీ రామారావు అని అన్నారు. అందరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, కార్పొరేటర్ మంగవేణి, తదితరులు పాల్గొన్నారు.

జెర్రిపోతులపాలెంలో భూమాయపై విచారణకు డిమాండ్

» కలెక్టర్ చర్యలు తీసుకోకపోతే ధర్నాకు దిగుతా..
» ఎమ్మెల్యే లెటర్ హెడ్‌పై ఫిర్యాదు చేసిన పట్టించుకోరా
» ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆగ్రహం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, మే 28 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలంలోని జెర్రిపోతులపాలెంలో సరిహద్దులో గల పెదగాడి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 420లో గల 4.75 ఎకరాల చెరువుపై జరిగిన భూమాయపై కలెక్టర్ విచారణ చేయించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. చెరువును డి పట్టాగా మార్చేసిన వైనంపై కలెక్టర్ జోక్యం చేసుకొని నిగ్గు తేల్చకపోతే ధర్నాకు దిగుతానని స్పష్టంచేశారు. తన (ఎమ్మెల్యే) లెటర్ హెడ్‌పై ఫిర్యాదు చేసినా కలెక్టర్ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని జెర్రిపోతులపాలెంలో నిర్వహించిన పలు కార్యక్రమాలకు ఎమ్మెల్యే పంచకర్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ సర్వే నంబర్ 420 ఎఫ్‌ఎంబీ స్కెచ్‌లో ఇప్పటికీ ఇది చెరువు భూమిగానే ఉందన్నారు. గతంలో గనుల శాఖ గ్రావెల్ తవ్వకాలకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. రెవెన్యూ శాఖ పరంగా చెరువు అని స్పష్టత ఉన్నా డి పట్టా మంజూరు కావడం విడ్డూరమన్నారు. తక్షణం డి పట్టాను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జలవనరుల పరిరక్షణ జరగాలన్నారు.

రుషికొండ బీచ్‌ను ముంచెత్తుతున్న చెత్త


బుధవారం మధ్యాహ్నం తీరానికి కొట్టుకు వచ్చిన పాత దుస్తులు

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్‌ను చెత్త ముంచెత్తుతోంది. ఎక్కడెక్కడి నుంచో పాత దుస్తులు తీరానికి కొట్టుకువస్తున్నాయి. కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులు, సముద్రంలో అలజడి వల్ల లోపలి నుంచి బరువైన చెత్త ఇక్కడికి వచ్చి పేరుకుపోతోంది. అందులో ఎక్కువగా దుస్తులు ఉంటున్నాయి. తీరాన్ని పరిశుభ్రం చేయడానికి జీవీఎంసీ సమకూర్చిన సిబ్బందిలో నలుగురు ఇక్కడే ఉండి గంట గంటకు వచ్చిన చెత్తను తీసి ట్రక్కులో తరలిస్తున్నారు. రోజుకు సుమారుగా రెండు టన్నుల పాత దుస్తులు ఇలా వస్తున్నాయని బీచ్ మేనేజర్ జగదీశ్ తెలిపారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆనందపురం, మే 28 (ఆంధ్రజ్యోతి) :ఆనందపురం - పెందుర్తి జాతీయ రహదారిలోని దుక్కవానిపాలెం టోల్‌ప్లాజా వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. పెందుర్తి నుంచి ఆనందపురం వైపు వస్తున్న వ్యాన్ దుక్కవానిపాలెం టోల్‌ప్లాజా దగ్గరకు వచ్చేసరికి ముందు వెళ్తున్న వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో మహారాష్ట్రలోని పరపాని జిల్లాకు చెందిన వ్యాన్ డ్రైవర్ నేతాజీ సభాష్‌దోతే (27) తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ సంతోష్, ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

డివైడర్‌ను బైక్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలు

సింధియా,మే 28, (ఆంధ్రజ్యోతి) : బైక్‌తో డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం రాత్రి మారుతీ సర్కిల్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. కాన్వెంట్ నుంచి షీలానగర్‌కు బుల్లెట్ పై వెళ్తున్న ఇద్దరు యువకులు అతి వేగంగా వచ్చి మారుతీ సర్కిల్ సమీపంలో డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. అటుగా ప్రయాణిస్తున్న కొందరు 108 వాహన సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన యువకులు ఎవరన్నది తెలియదు.

18.5 కిలోల గంజాయి స్వాధీనం

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి) : రైలులో గంజాయిని హైదరాబాద్ తరలించేందుకు యత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను జిల్లా ఎక్సైజ్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 18.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చిన ఇద్దరు వ్యక్తులు జ్ఞానాపురం రైల్వేస్టేషన్ వద్ద వేచి ఉన్నారని ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆర్. ప్రసాద్‌కు సమాచారం అందింది. ఆయన సీతమ్మధార ఎక్సైజ్ సీఐ సత్యవేణి, సీఐ రవికిరణ్, ఎస్‌ఐ ముసలినాయుడును అప్రమత్తం చేశారు. వారు జ్ఞానాపురం స్టేషన్ వద్దకు చేరుకుని అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, బ్యాగ్‌లను తనిఖీ చేశారు. వారిలో ఒకరు ఒడిశాలోని రాయగడకు చెందిన జిబాన్‌జ్యోతిపానీ (21), మరొకరు చత్తీస్‌ఘడ్‌కు చెందిన ప్రిన్స్ వికాస్‌బోర్డన్ (48)గా గుర్తించారు. వారిద్దరూ ఒడిశాలోని రేపనక అటవీ ప్రాంతంలో కిలో రూ. వెయ్యి చొప్పున గంజాయి కొని రూ. 4 వేలు చొప్పున హైదరాబాద్‌లో విక్రయించేందుకు 18.5 కిలోలు గంజాయిని రెండు బ్యాగ్‌ల్లో పెట్టుకుని నగరానికి తీసుకొచ్చారని విచారణలో తేలింది. ఇక్కడి నుంచి రైలుమార్గంలో హైదరాబాద్ వెళ్లాలని భావించినట్టు నిందితులు చెప్పారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిస్తున్నట్టు సీఐ రవికిరణ్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న తమిళవాసి అరెస్టు

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయి తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన పుగాజ్హేంది (23)ను అరెస్టు చేసినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు తెలిపారు. రైల్వే డిప్యూటీ సూపరింటెండెంట్ పి.రామచంద్రరావు సూచనల మేరకు జీఆర్పీ, ఆర్పీఎఫ్ సంయుక్తంగా విశాఖపట్నం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాల్లో బుధవారం ముమ్మరంగా తనిఖీ చేస్తుండగా గంజాయితో ఉన్న పుగాజ్హేందిని పట్టుకున్నట్లు చెప్పారు. అతడి వద్ద నుంచి రూ.35 వేల విలువైన 7 కిలోల గంజాయిని సీజ్‌చేసి సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే అబ్దుల్ మారూఫ్‌కు అప్పగించామన్నారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాను గుర్తించడానికి విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీస్, ఆర్పీఎఫ్ ప్రత్యేక బృందాల సహాయంతో నిఘా వర్గాలను ఏర్పాటు చేసి విశాఖపట్నం, దువ్వాడ, అనకాపల్లి, సింహాచలం రైల్వే స్టేషన్ల పరిధిలో తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు.